


# అక్షరకలం
తెలుగు దినపత్రిక




సంపుటి : 17 సంచిక : 163 | 20-07-2025 ఆదివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00

## హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎ కె సింగ్
# ప్రమాణ స్వీకారం

తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ నేడు బాధ్యతలు స్వీకరించారు.. రాజ్‌భవన్‌లో ఆయనతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన సీజేగా ప్రమాణం చేసిన ఏకే సింగ్ కు అభినందనలు తెలియజేశారు.

వార్త 2లో



## బనకచర్లతో తెలంగాణకు
# అన్యాయం జరగనివ్వం

- గోదావరిలో మిగులు జలాలు లేవని నిపుణులు చెబుతున్నారన్న డీకే అరుణ
- మిగులు జలాలపై స్పష్టత రావాల్సి ఉందని వ్యాఖ్య
- బనకచర్లపై చర్చ జరగాల్సిన అవసరముందన్న బీజేపీ ఎంపీ

గోదావరి నదిలో మిగులు జలాలు లేవని నిపుణులు చెబుతున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఒకవేళ మిగులు జలాలు ఉంటే... ఎన్ని ఉన్నాయి? వాటిని ఏపీకి తీసుకెళ్లే అవకాశం ఉందా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల సమావేశాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు.

వార్త 2లో





## ఓడిపోతే బాగుండేది...
# ఇంట్లో కూర్చునేవాడిని

- మేడ్చల్ నియోజకవర్గానికి మంత్రిగా ఎంతో చేశానన్న మల్లారెడ్డి
- తనకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని ఆవేదన
- అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శ

వివరాలు 2లో

## పదేళ్లు నేనే సీఎం అన్న రేవంత్ రెడ్డి...

రేవంత్ ప్రకటన పార్టీ విధానాలకు విరుద్ధంగా ఉందన్న రాజగోపాల్ రెడ్డి
కాంగ్రెస్ లో ప్రజాస్వామ్యబద్ధంగా సీఎం ఎన్నిక ఉంటుందని వ్యాఖ్య
చర్చనీయాంశంగా మారిన

### కోమటిరెడ్డి ట్వీట్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న నాగర్ కర్నూల్ జిల్లాలో పర్యటించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో యంగ్ ఇండియా స్కూల్ కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. మరో పదేళ్లు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని ఆయన అన్నారు. ఈ వ్యాఖ్యలపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఎక్స్ వేదికగా రాజగోపాల్ రెడ్డి స్పందిస్తూ... రేవంత్ ప్రకటన పార్టీ విధానాలకు విరుద్ధంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో అధిష్ఠానం ఆదేశాల మేరకు, ప్రజాస్వామ్యబద్ధంగా ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుందని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సహించరని అన్నారు. రాజగోపాల్ ట్వీట్ చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవిని ఆశించి రాజగోపాల్ రెడ్డి భంగపడ్డారు. ఈ క్రమంలో ఆయన తొలిసారి ధిక్కారస్వరం వినిపించినట్టయింది.





## శ్రీశైలం ప్రాజెక్టుకు మళ్లీ పెరిగిన వరద

ఎగువన కురుస్తున్న వర్షాలతో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణానది
జూరాల 15 గేట్లు ఎత్తివేత
శ్రీశైలం ప్రస్తుత నీటిమట్టం 881.60 అడుగులు

వార్త 2లో

# ఐదు ఫైటర్ జెట్లు కూలిపోయాయి..

- ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ మరోమారు వ్యాఖ్యలు
- వైట్‌హౌస్‌లో రిపబ్లికన్ చట్టసభ్యులకు ట్రంప్ ప్రైవేటు విందు
- ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌పై ప్రస్తావన
- ఐదు జెట్లను ఆకాశంలోనే పేల్చేశారన్న అధ్యక్షుడు
- అవి ఏ దేశానివో స్పష్టంగా చెప్పని వైనం

వార్త 2లో

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు స్పందించారు. ఈ ఘర్షణలో 'ఐదు జెట్లు కూలిపోయాయని' పేర్కొన్నారు. అమెరికా శ్వేతసౌధంలో రిపబ్లికన్ చట్టసభ్యులకు ఇచ్చిన ప్రైవేటు విందులో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.



# జై తెలంగాణ అనని సీఎం పాలనలో మహనీయులకు అవమానాలు

జై తెలంగాణ అనని సీఎం పాలనలో మహనీయులకు అవమానాలు
గంభీరావుపేటలో జయశంకర్ విగ్రహ గద్దె కూల్చివేత
అనుమతులు లేవంటూ కూల్చివేసిన అధికారులు
గద్దెను కూల్చివేయడం దారుణమన్న కవిత

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ గద్దెను అధికారులు కూల్చేశారు. నమాజ్ చెరువు కట్ట శివారులో విగ్రహ ఏర్పాటు పనులకు ఎలాంటి పర్మిషన్లు లేవంటూ ఇరిగేషన్ శాఖ అధికారులు గద్దెను జేసీబీతో నేలమట్టం చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని చెప్పారు. నమాజ్ చెరువు కట్టపై ఆయన విగ్రహ ఏర్పాటు కోసం నిర్మించిన గద్దెను కూల్చివేయడం దారుణమని అన్నారు. జై తెలంగాణ అనని ముఖ్యమంత్రి పాలనలో తెలంగాణ మహనీయులకు ఇలాంటి అవమానాలు జరగడం మనసును కలచి వేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించి జయశంకర్ సార్ విగ్రహ ఏర్పాటుకు అనుమతిని ఇవ్వాలని... గద్దెను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



# హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎ కె సింగ్ ప్రమాణ స్వీకారం



హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ హైకోర్టు నూతన సీజేగా జస్టిస్ ఏకే సింగ్ నేడు బాధ్యతలు స్వీకరించారు.. రాజ్‌భవన్‌లో ఆయనతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. గతంలో ఆయన త్రిపుర హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. ఈ ప్రమాణస్వీకారం కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. నూతన సీజేగా ప్రమాణం చేసిన ఏకే సింగ్ కు అభినందనలు తెలియజేశారు.

### ఏకే సింగ్ గురించి క్లుప్తంగా

న్యాయకోవిదుల కుటుంబంలో మూడో తరానికి చెందిన జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న డాక్టర్ రాంగోపాల్‌సింగ్, డాక్టర్ శ్రద్ధ సింగ్ దంపతులకు జన్మించారు. ఆయన తల్లివైపు కుటుంబానికి చెందిన తాత జస్టిస్ బీపీ సిన్హా సుప్రీంకోర్టు ఆరో ప్రధాన న్యాయమూర్తిగా, మరో తాత అయిన జస్టిస్ శంభుప్రసాద్ సింగ్ పట్నా హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిసగా బాధ్యతలు నిర్వర్తించారు. సమీప బంధువులైన జస్టిస్ బిశ్వేశ్వర్ ప్రసాద్, జస్టిస్ శివకీర్తి సింగ్ సుప్రీంకోర్టు జడ్జీలుగా పనిచేశారు.

### రాహుల్ తోనే రక్ష : డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, న్యాయశాస్త్రంలో డిగ్రీ పొందిన ఏకే సింగ్ 1990లో ఉమ్మడి పట్నా హైకోర్టులో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 1990 నుంచి 2000 వరకు పట్నా హైకోర్టులో, 2001 నుంచి 2012 వరకు జార?ండ్ హైకోర్టులో న్యాయవాదిగా పలు కీలక కేసులు వాదించారు. 2012లో జార?ండ్ హైకోర్టు అదనపు న్యాయయమూర్తిగా, 2014లో శాశ్వత న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. 2022లో జార?ండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిసగా సేవలు అందించి, 2023లో త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిసగా పదోన్నతి పొందారు.

## బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరగనివ్వం

### గోదావరిలో మిగులు జలాలు లేవని నిపుణులు చెబుతున్నారన్న డీకే అరుణ

### మిగులు జలాలపై స్పష్టత రావాల్సి ఉందని వ్యాఖ్య

### బనకచర్లపై చర్చ జరగాల్సిన అవసరముందన్న బీజేపీ ఎంపీ

హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

గోదావరి నదిలో మిగులు జలాలు లేవని నిపుణులు చెబుతున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఒకవేళ మిగులు జలాలు ఉంటే... ఎన్ని ఉన్నాయి? వాటిని ఏపీకి తీసుకెళ్లే అవకాశం ఉందా? అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉందని చెప్పారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిల సమావేశాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. ఏపీ నిర్మించాలనుకుంటున్న బనకచర్ల ప్రాజెక్టుపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని అరుణ చెప్పారు. బనకచర్లతో తెలంగాణకు అన్యాయం జరగనిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. టెలీ మీటర్లు కొత్తేం కాదని... వీటిపై గతంలో కూడా చర్చ జరిగిందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని అన్నారు.

## ఓడిపోతే బాగుండేది... ఇంట్లో కూర్చునేవాడిని

### మేడ్చల్ నియోజకవర్గానికి మంత్రిగా ఎంతో చేశానన్న మల్లారెడ్డి

### తనకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని ఆవేదన

### అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శ

హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎంతో చేశానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తెలిపారు. మంత్రిగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడిన తనకు కనీస గౌరవం కూడా దక్కడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని అన్నారు. తాను ఓడిపోతే బాగుండేదని... ఇంట్లో కూర్చునేవాడినని చెప్పారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్ లో జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, లక్షారెడ్డి, జిల్లా కలెక్టర్ తదితరులు హాజరయ్యారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ... బడి, గుడి అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం, గంజాయిని విక్రయిస్తున్నారని మండిపడ్డారు. దీని కారణంగా యువత పెడధోరణి పడుతున్నారని చెప్పారు. ప్రొహిబిషన్ శాఖ ప్రమోషన్ శాఖగా మారిందని విమర్శించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. అధికారులు చేసే పనుల ద్వారా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు అనే వ్యత్యాసం చూపకుండా ప్రజలకు లబ్ధి కలిగేలా చూడాలని సూచించారు.

## శ్రీశైలం ప్రాజెక్టుకు మళ్లీ పెరిగిన వరద

### ఎగువన కురుస్తున్న వర్షాలతో నిండుగా ప్రవహిస్తున్న కృష్ణానది

### జూరాల 15 గేట్లు ఎత్తివేత

### శ్రీశైలం ప్రస్తుత నీటిమట్టం 881.60 అడుగులు

ఎగువన కురుస్తున్న వర్షాలతో కృష్ణానది నిండుగా ప్రవహిస్తోంది. జూరాల ప్రాజెక్టు 15 గేట్లను ఎత్తివేశారు. దీంతో, శ్రీశైలం డ్యామ్ కు భారీగా వరద నీరు చేరుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా... ప్రస్తుత నీటిమట్టం 881.60 అడుగులుగా ఉంది. డ్యామ్ నిల్వ సామర్థ్యం 215.807 టీఎంసీలు కాగా... ప్రస్తుత నీటిమట్టం 196.561గా ఉంది. వరద ప్రవాహం పెరిగితే ప్రాజెక్టు గేట్లను మళ్లీ ఎత్తే అవకాశం ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ వైపు విద్యుత్ కేంద్రాల ద్వారా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది.

# ఐదు ఫైటర్ జెట్లు కూలిపోయాయి..

### ఆపరేషన్ సిందూర్‌పై ట్రంప్ మరోమారు వ్యాఖ్యలు

### వైట్‌హౌస్‌లో రిపబ్లికన్ చట్టసభ్యులకు ట్రంప్ ప్రైవేటు విందు

### ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌పై ప్రస్తావన

### ఐదు జెట్లను ఆకాశంలోనే పేల్చేశారన్న అధ్యక్షుడు

### అవి ఏ దేశానివో స్పష్టంగా చెప్పని వైనం

హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు స్పందించారు. ఈ ఘర్షణలో 'ఐదు జెట్లు కూలిపోయాయని' పేర్కొన్నారు. అమెరికా శ్వేతసౌధంలో రిపబ్లికన్ చట్ట సభ్యులకు ఇచ్చిన ప్రైవేటు విందులో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, ఏ దేశానికి చెందిన జెట్లు కూలిపోయాయన్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. "నిజానికి విమానాలను ఆకాశంలోనే పేల్చేశారు. ఐదు, ఐదు, నాలుగు లేదంటే ఐదు జెట్లు.. ఐదు జెట్లు అనే అనుకుంటున్నాను. వాటిని పేల్చేశారు" అని ట్రంప్ చెప్పుకొచ్చారు. భారత్‌తో జరిగిన ఘర్షణలో ఆ దేశానికి చెందిన జెట్లను కూల్చివేశామని పాకిస్థాన్ పదేపదే చెబుతోంది. ఇందులో మూడు రఫేల్ యుద్ధ విమానాలు కూడా ఉన్నాయని పేర్కొంది. అంతేకాదు, భారత పైలట్లను కూడా పట్టుకున్నామని చెప్పింది. అయితే, ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయింది. పాక్ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ ఉంది. అయితే, భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన విమానాలను భారత్ కోల్పోయిందని ఇటీవల సీడీఎస్ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ అంగీకరించారు. అయితే, ఆరు విమానాలను తాము ధ్వంసం చేశామన్న పాక్ కథనాన్ని ఆయన తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా

### బీఆర్ఎస్ నుంచి రావడానికి అనేక కారణాలు

### పదవుల కోసం ఏనాడూ పార్టీ మారలేదు

### అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి అనేకులు కుట్ర

### కొందరు కడుపులో కత్తులు పెట్టుకుని మాట్లాడుతారు

### ఇకనుంచి స్ట్రేట్ ఫైట్.. నో స్ట్రీట్ ఫైట్

### హుజూరాబాద్ కార్యకర్తలతో ఈటెల రాజేందర్ వ్యాఖ్యలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

హుజూరాబాద్ అనేక త్యాగాలకు అడ్డా అని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. హుజూరాబాద్ నుంచే అనేక పోరాటాలు చేశామన్నారు. కొందరు సామాజిక మధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. భారత రాష్ట్ర సమితి నుంచి బయటికి రావడానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పారు. తాను పదవుల కోసం పార్టీ మారలేదని చెప్పారు. హైదరాబాద్‌లోని శామీర్‌పేటలో హుజూరాబాద్ భాజపా కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సీఎంగా ఉన్న కేసీఆర్‌కు నా నిర్ణయాలు మొహమాటం లేకుండా చెప్పాను. గతంలో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో ప్రజల ఆత్మగౌరవం గెలిచింది. నేను అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశా. గతంలో హుజూరాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో నా ఓటమికి చాలా మంది కుట్రలు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నా అడుగు పడని గ్రామాలు లేవు. నేను పోరాటాలు చేస్తే కరీంనగర్ ప్రజలు అండగా ఉండేవారు. హుజూరాబాద్ గడ్డలో ప్రతి గ్రామంలోని వార్డు సభ్యుడిని గెలిపిస్తామని ఈటల తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, వారిని కడుపులో పెట్టుకుని కాపాడు కుంటానని అన్నారు. ఇదే సందర్భంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్‌కి పరోక్షంగా కౌంటర్ ఇచ్చారు. హుజురాబాద్‌లో బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శామీర్‌పేట్‌లోని ఈటెల రాజేందర్ ఇంటికి శనివారం కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి రాజేందర్ మాట్లాడారు. హుజురాబాద్ తెలంగాణ ప్రతీకకు అడ్డా అని ఉద్ఘాటించారు. ఇక నుంచి అక్కడ స్ట్రేట్ ఫైట్ ఉంటుందని.. స్ట్రీట్ ఫైట్ మాత్రం ఉండదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో అవమానాలు, అవహేళనలను దాటి తాను ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు. అప్పుడు కేసీఆర్ తన విషయంలో చేసింది అదేనని గుర్తుచేశారు. అయినా హుజురాబాద్ బిడ్డలు తనను కాపాడుకున్నారని ఉద్గాటించారు. తాను అలాగే వారిని కాపాడుకుంటానని మాటిచ్చారు. దక్షిణ భారతదేశంలో తన నియోజకవర్గానికి నేరుగా వచ్చి ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశం పెట్టారని ఎంపీ ఈటెల రాజేందర్ గుర్తుచేశారు. శత్రువుతో కొట్లాడవచ్చు కానీ కడుపులో కత్తులు పెట్టుకొనే వారితో పోరాటం చేయలేమని విమర్శించారు. భారతీయ జనతా పార్టీలో అన్నిరకాల అంశాలని పరిగణనలోకి తీసుకుంటారనే ఈ పార్టీలో చేరానని చెప్పుకొచ్చారు. తెలంగాణలో తాను తొక్కని ఇంటి గడప లేదని.. తనకు తెలియని వారు లేరని... బీసీ బిడ్డగా తాను మంత్రి పదవులు పొందానని గుర్తుచేశారు. వీరుడు ఎక్కడ భయపడడు. హుజురాబాద్ గడ్డ మీద తన ప్రతి అనుచరుడు ఉంటారని వెల్లడించారు. తన సర్పంచులు, ఎంపీటీసీలు, తన వార్డ్ మెంబర్లు కూడా ఉంటారని తెలిపారు. దేశ ప్రధాని వ్యక్తుల కోసం కాకుండా వ్యవస్థ నిర్మాణం కోసం పని చేస్తున్నారని చెప్పారు. మనమంతా దేశ ధర్మం కోసం కట్టుబడి పని చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో కొంతమంది ఉంటారని.. ఇతరులను ఎదగనివ్వకుండా చేయడమే వాళ్ల పని విమర్శించారు. కచ్చితంగా హుజురాబాద్



వస్తా.. మీ వెంట ఉంటానని హామీ ఇచ్చారు. తనను ఏడుసార్లు గెలిపించారని... ఎవరికీ భయపడేది లేదని రాజేందర్ స్పష్టం చేశారు. రాజకీయాల్లో చిన్న మనస్కులు, కురుస మనస్తత్వం ఉన్న వాళ్లు ఉంటారని తెలిపారు. వాళ్లు కడుపులో కత్తులు పెట్టుకొని ఉంటారుని.. అలాంటిది వారితో యుద్ధం చేయడం కష్టమే కానీ ఎదురెళ్లి నిలబడాలని చెప్పుకొచ్చారు. ఇక నుంచి హుజురాబాద్‌లో ప్రతి మండలానికి ఒక కార్యాలయం ఉంటుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి ,కేసీఆర్ లాంటి వాళ్లతో తాను కొట్లాడానని గుర్తుచేశారు. సముద్రంలో తుఫాన్ వచ్చే ముందు సైలెంట్‌గా ఉంటదని చెప్పుకొచ్చారు. తన లాంటి వాళ్లు మాట్లాడితే సమాజం రియాక్ట్ అవుతుందని.. తాను ప్రజల నుంచి వచ్చిన వాడినని, ప్రజలే తనకు న్యాయ నిర్ణేతలని ఈటెల స్పష్టం చేశారు.

# పవర్ లేకపోయేసరికి ఉండలేక పోతున్న కెటిఆర్

### కెటిఆర్‌ను సిరిసిల్లలో తరిమి కొట్టడం ఖాయం

### మాజీ ఎమ్మెల్యే,కాంగ్రెస్ నేత మైనంపల్లి విమర్శలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

పవర్ లేకపోతే కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు బతకలేక పోతున్నారని కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు దెప్పిపొడిచారు. కేటీఆర్ తన కంటే జూనియర్, బచ్చాగాడని ఎద్దేవా చేశారు. కేటీఆర్‌ను సిరిసిల్లాలో చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. కేటీఆర్ తన జీవితంలో ఏనాడూ ముఖ్యమంత్రి కాలేరని విమర్శించారు. శనివారం గాంధీభవన్‌లో మైనంపల్లి హన్మంత రావు మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ తీరుపై మండిపడ్డారు. కేటీఆర్ బాసన్లు తోముకోవాల్సిందేనని ఎద్దేవా చేశారు. మా జోలికి వస్తే మీ బావపై ఎటాక్ చేస్తామని హెచ్చరించారు. ఏం చేయడానికి భారత రాష్ట్ర సమితి పెట్టారని నిలదీశారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కేటీఆర్ మైండ్ పనిచేయడం లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తల జోలికి వస్తే కేటీఆర్, హరీష్‌రావు ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. బావ, బామ్మర్ధుల బట్టలు విప్పుతానని మైనంపల్లి హన్మంతరావు వార్నింగ్ ఇచ్చారు. కేటీఆర్ రెడ్‌బుక్ పెట్టుకొని ఏం చేస్తారని ప్రశ్నించారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కేటీఆర్ బద్నాం చేశారని విమర్శించారు. సెటిలర్స్‌ను కాపుడుకుంటానని కేసీఆర్ అనలేదా అని ప్రశ్నించారు. గ్రేటర్‌లో బీఆర్ఎస్‌కి 24 సీట్లు ఇచ్చిన సెటిలర్స్‌పై కేటీఆర్‌కి అంత కోపం ఎందుకని నిలదీశారు. లోకల్, నాన్ లోకల్ అనే ఫీలింగ్ ఎందుకు తెస్తున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో కేటీ-ఆర్ షాడో ముఖ్యమంత్రిగా పనిచేశారని ఆరోపించారు. కేటీ-ఆర్ ది నరం లేని నాలుక అని ఆక్షేపించారు. జర్నలిస్ట్ స్వేచ్ఛ చనిపోవడానికి కారణం కేటీఆర్. ఆయన ప్రవర్తనలో మార్పు లేదు.. ఇప్పటికీ అలాగే మాట్లాడుతున్నాడు. కేటీఆర్ అరాచకాలపై పుస్తకం రాస్తాను. గడపగడపకి నేను రాసే పుస్తకాన్ని ఇచ్చే బాధ్యత నాదే. భార్య, భర్తలను కేటీఆర్ విడదీశాడని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కి లేదు. ఏపీలో వైసీపీ నేతలు భయపడి విదేశాలకు, వేరే రాష్ట్రాలకు పారిపోయారు. మూసీ చుట్టూ ఉన్న అక్రమ ఇళ్లు కూలగొడుతాం.. అడ్డు రావద్దని కేటీ-ఆర్ చెప్పాడు. పైసలు తీసుకొని పదవులు ఇస్తామని బీఆర్ఎస్ నాయకులు మోసం చేశారు. కేటీ-ఆర్ జైలు ఊచలు లెక్కపెట్టే రోజులు వస్తాయి. హరీష్‌రావు, కేటీ-ఆర్‌లను అరెస్ట్ చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ఆలస్యం చేస్తున్నారో అర్థం కావట్లేదు. కేటీఆర్‌కి ఆయన భాషలో చెబితేనే అర్థం అవుతుంది. కాంగ్రెస్ హై కమాండ్ పిలుపునిస్తే లక్షలాది మంది శ్రేణులు రోడ్లపైకి వస్తారని మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు.



# అక్రమ సంబంధంతో భర్తను కడతేర్చిన భార్య

## ఢిల్లీలో వెలుగుచూసిన మరో ఘటన

న్యూఢిల్లీ,

ఇష్టంలేని పెళ్లిళ్లు, అక్రమ సంబంధాలు, అత్తింటిలో వేధింపులు వంటి కారణాలతో భార్యలు భర్తలను అడ్డు తొలిగించుకుంటున్న ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా దిల్లీలో ఇలాంటి హత్యే ఒకటి జరిగింది. మృతుడి కజిన్‌తో కలిసి నిందితురాలు ఈ దారుణానికి ఒడిగట్టింది. దిల్లీకి చెందిన సుస్మిత జులై 13న తన భర్త కరణ్‌దేవ్(36)కు కరెంట్ షాక్ తగిలిందని ఆసుపత్రికి తీసుకొచ్చింది. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు– ధ్రువీకరించారు. ఆమె చెప్పినట్టు–గా దీన్ని ఓ ప్రమాదమని నమ్మిన కరణ్ కుటు–ంబసభ్యులు పోస్ట్‌మార్టం అవసరం లేదని చెప్పారు. కానీ, ఈ కేసులో సుస్మిత, మృతుడి బంధువు రాహుల్ తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. అటు– కరణ్ సోదరుడికి కూడా అనుమానం వచ్చి సుస్మిత ఇన్‌స్టా చాటింగ్‌ను పరిశీలించాడు. అందులో ఆమె రాహుల్‌తో మర్డర్ ఎ÷–లాన్ గురించి చర్చించినట్లు– గుర్తించిన అతడు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. దీంతో సుస్మిత, రాహుల్ మధ్య సంబంధం బయటపడటంతో పాటు– కరణ్‌ది సహజమరణం కాదని, హత్య అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. కరణ్ అడ్డు తొలగించుకునేందుకు తొలుత నిందితులు భోజనంలో నిద్ర మాత్రలు ఇచ్చారు. తర్వాత అతడు స్పృహ కోల్పోయే వరకు ఎదురుచూశారు. మోతాదుకు మించి నిద్ర మాత్రలు వేసుకుంటే.. ఎంతసేపటిలో మరణం సంభవిస్తుందో కూడా వారు నెట్‌లో వెతికారు. ఆ మాత్రలు తీసుకున్నా కరణ్ ఊపిరి ఆగకపోవడంతో.. ప్రమాదంగా చిత్రీకరించేందుకు కరెంట్ షాక్ ఇచ్చారు. చాటింగ్ ద్వారా వెల్లడైన ఈ వివరాల ఆధారంగా పోలీసులు నిందితులను కస్టడీలోకి తీసుకున్నారు. దర్యాప్తులో ఆమె నేరాన్ని అంగీకరించినట్లు– పోలీసులు తెలిపారు. కరణ్ తనను డబ్బు కోసం వేధించేవాడని, దాంతో తాను తీవ్ర మనోవేదనకు గురయ్యానని ఆమె వెల్లడించింది. ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# ఆర్థిక నేరగాళ్లా కాంగ్రెస్‌ను విమర్శించేది?

### పదేళ్లు దోపిడీ చేసిన వారికి మాట్లాడే హక్కు లేదు

### కెటిఆర్ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

హనుమకొండ,

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్‌కు జైలు జీవితం తప్పదని కాంగ్రెస్ నేతలు హెచ్చరించారు. అవినీతిలో కూరుకు పోయి, ఆర్థిక అవతవకలకు పాల్పడిన వారు అదేపనిగా ప్రభుత్వంపైనా, సిఎం రేవంత్‌పైనా విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కెటిఆర్ తీరు మార్చుకోకపోతే తగిన బుద్ధిచెబుతామని కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. వరంగల్‌కు ఇచ్చిన హామీలను మరిచిన దొంగ కేటీఆర్ అని విమర్శించారు. తమ ప్రభుత్వం చేసే అభివృద్ధి కేటీఆర్‌కి కనిపించడం లేదా... కళ్లు కనిపించకపోతే డాక్టర్ వద్దకు తీసుకుపోతానని నాయిని రాజేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. శనివారం హనుమకొండలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ తదితరులు రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి




మీడియాతో మాట్లాడుతూ.. పదేళ్లలో తెలంగాణకు ఏం చేశారని ప్రశ్నించారు. పదిమంది లంపెన్ గ్యాంగులతో కేటీఆర్.. కాంగ్రెస్ నేతలపై దాడులకు దిగుతున్నారని నాయిని రాజేందర్ రెడ్డి ఆరోపించారు . తాము తలచుకుంటే రోడ్లపై కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు తిరగలేరని హెచ్చరించారు. సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శిస్తే చూస్తు ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. రేవంత్‌రెడ్డికి సీఎం పదవి రాకముందు దూకుడుగా ఉండేవాళ్లమని... ఇప్పుడు తమ చేతులని హై కమాండ్ కట్టేస్తోందని చెప్పుకొచ్చారు. బీజేపీతో బీఆర్ఎస్ పొత్తుపై మీ చెల్లె కవిత చెప్పింది నిజం కాదా అని ఎమ్మెల్యే నాయిని ప్రశ్నల వర్షం కురిపించారు. మాజీమంత్రి కేటీఆర్ డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. శవాలపై పేలాలు ఏరుకునే రకం కేటీఆర్ అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి జోలికి వస్తే ఊరుకోమని హెచ్చరించారు. కేటీఆర్ ఆర్థిక నేరస్తుడని.. ఆయన కుటుంబం అంతా నేరపూరితమైందని ఆరోపించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా రొయ్యల పులుసుకు మీ నాన్న కేసీఆర్ అలవాటు–పడితే.. నువ్వు లెగ్గులు,పెగ్గులకు అలవాటు పడ్డావని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రజల్లోకి రాకుండా ఫాంహౌస్‌లో ఏం చేస్తున్నారని ఎమ్మెల్యే నాగరాజు ప్రశ్నించారు. ఇకముందు విమర్శించే ముందు మాటలు జాగ్రత్తగా రావాలని అన్నారు.

# మోడీ ఛరిష్మాతోనే బిజెపికి మహర్దశ

### 2047 వరకు మోడీయే ప్రధానిగా ఉండాలి

### బిజెపి ఎంపి నిశికాంత్ దూబే ప్రకటన

న్యూఢిల్లీ,

ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మాతోనే బిజెపికి ప్రజలు ఓట్లు– వేస్తున్నారని బిజెపి ఎంపి నిశికాంత్ దూబే పేర్కొన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత బిజెపి ముఖ చిత్రం మారిపోయిందని ప్రశంసించారు. వరుసగా మూడు సార్లు లోక్ సభ ఎన్నికలలో, అనేక రాష్ట్రాల్లో మోడీ నేతృత్వంలో బిజెపి పాలన కొనసాగిస్తోందని కొనియాడారు. బిజెపిలో మోడీ లేకుంటే లోక్ సభ ఎన్నికలలో 150 సీట్లు గెలుచుకోవడం కష్టం అని దూబే తన అభిప్రాయం వ్యక్తం చేశారు. బిజెపి లేని రాష్ట్రాల్లో కూడా ఈ రోజు పాలన కొనసాగడానికి కారణం మోడీనేనని మెచ్చుకున్నారు. 75 ఏళ్ల తరువాత బిజెపి నేతలు పదవీ విరమణ చేస్తారనే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై నిశికాంత్ స్పందించారు. మోడీ శరీరం సహకరించినంతవరకు, అంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతే.. మోడీ లక్ష్యమని గుర్తు చేశారు. ఆ లక్ష్యం చేరేవరకు మోడీ అవసరం భారత్ కు ఉందన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత పేదల్లో ఎక్కువ మందికి బిజెపిపై నమ్మకం ఏర్పడిందని, తమ పార్టీ నచ్చినవాళ్లు కూడా ఉన్నారని, అందరికీ నచ్చాలని ఏమీ లేదన్నారు. మోడీ లేకపోతే బిజెపి బలంగా ఉండేది కాదని తాను కార్యకర్తగా నమ్ముతున్నానని దూబే కుండబద్దలు కొట్టారు.

# మాయమవుతున్న మానవ విలువలు !

మాయమవుతున్నదమ్మా..మనిషన్న వాడు అన్న చందంగా మన సమాజాం తయారయ్యింది. హత్యలు, హత్యాచారాలు,అకృత్యాలు నిత్యకృత్యం అయ్యాయి. అమ్మాయిలు కనిపిస్తే అ÷–యాచారం చేసి చంపేస్తున్నారు. కాలేజీలకు వెళ్లాలంటేనే భయంకర పరిస్థితులు ఉన్నాయి. తోటి విద్యార్థి లేదా పాఠాలు చెప్పే టీచర్లు ఎవరు కాటేస్తారో తెలియని పరిస్థితి ఉంది. అత్యాచారంతో పాటు ఏకంగా హత్యలు చేసేస్తు న్నారు. ప్రతిఘటించినా కిరాతకంగా చంపేస్తున్నారు. మృగాళ్ల రాక్షసప్రవృత్తి మితిమీరి పోతోంది. భర్తలను చంపే భార్యు..భార్యలను చంపే భర్తలు..ప్రేమ పేరుతో చంపే కుర్రాళ్లు..ఒంటరిగా వెళ్ళిన అమ్మాయిని కాపుకాసి ఎత్తుకెళ్లి హత్యాచారం చేయడం వంటివన్నీ నిత్యం చూస్తున్నాం. ఉపాధ్యాయ విద్యార్థిని పట్ల ఓ అధ్యాపకుడే వేధింపులకు పాల్పడితే..; కళాశాలకు వెళ్లిన విద్యార్థిని విగతజీవిగా తుప్పల్లో పడి ఉంటే ... మహిళలకు ఇంకేం భద్రత ఉన్నట్లు... భర్తలను వదించుకునే భార్యల క్రమసంఖ్య పెరుగు తోంది. ప్రియుడి మోజుల చంపేవారు కొందరు....ప్రియురాలి కోసం భార్యలను వదిలించుకునే వారు మరికొందరు... ఆస్తుల పంచాయితీల్లో అన్నాతమ్ములమనే భావన పోతోంది. అన్నను తమ్ముడు చంపడమో..తమ్ముడిని అన్నను చంపడమో మామూలు విషయం అయ్యింది. మద్యానికి బానిసలై తల్లిదండ్రులను కడతేరుస్తున్నారు. తల్లులను, తండ్రులను కడతేర్చడానికి వెనకాడడం లేదు. ఇలా దేశంలో ఎక్కడ చూసినా రోజుకు డజన్ల కొద్దీ సంఘటనలు వినాల్సి వస్తోంది. పోలీసులు అన్నా..జైలు అన్నా భయం లేకుండా పోతోంది. కొన్ని రోజులు జైలుకు వెళ్లి వద్దాంలే అన్న ధోరణి కనిపిస్తోంది. జైలుకు వెళతామన్న జ్ఞానం లేకుండా కడతేరుస్తున్నారు. ఇక అత్యార ఘటనలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇటీవల హైదరాబాద్‌లో ఓ కూతరు ప్రియుడితో కలసి తల్లిని హత్య చేయించింది. వరంగల్‌లో ప్రియురాలు మోజులో పడి భార్యను నిర్లక్ష్యం చేయడంతో ఇటీవల ఓ డెంటిస్ట్ ఆత్మహ్తయ చేసుకుంది. ఇలా ఒకటనికాదు..వందలకొద్దీ అనేక ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. సమాజంలో పడిపోతున్న విలువలు, పెరుగుతున్న విష సంస్కృతికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కోల్‌కతాలో వరుస హత్యాచార ఘటనలు..ఆందోళన కలిగించాయి. కోల్‌కత్తా లాకాలేజీ విద్యార్థినిపై సహ విద్యార్థుల అత్యాచారం,ఐఐఎం విద్యార్థినిపై కళాశాల హాస్టల్లోనే అఘాయిత్యం జరిగాయి. బెంగాల్‌లో అధికార పార్టీకి చెందిన విద్యార్థి సంఘం నాయకులు ఈ దుర్మార్గం వెనుక ఉన్నారని వార్తలు వచ్చాయి. గతేడాది ఆగస్టు 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్‌జి కర్ హాస్పటల్లో జూనియర్ డాక్టర్ అత్యాచారానికి, హత్యకు గురి కావడం దేశవ్యాప్త ఆందోళనలకు దారి తీసింది. జాతీయ నేర నివారణ విభాగం గణాంకాల ప్రకారం.. దేశంలో రోజుకు 86 అత్యాచారాలు నమోదవుతున్నాయి. ఇందులో 90 శాతం దారుణాలు తెలిసిన వ్యక్తుల ద్వారానే జరుగు తుండడం గమనార్హం. బాధితుల్లో 10 శాతం మంది 18ఏళ్ల లోపు వారు కాగా, 66శాతం మంది 18–30 ఏళ్ల లోపువారు. దేశంలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న హత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నారు. దేశంలో,రాష్ట్రంలో విద్యార్థినులపై జరుగుతున్న దారుణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. సామాజికంగా, శాంతిభద్రతల పరంగా మన వెనుక బాటుతనాన్ని, పాలకుల నిర్లక్ష్య, నిర్లిప్త ధోరణులను ఎత్తి చూపుతు న్నాయి. చదువుకునే చోట విద్యార్థినులకు తగిన భద్రత కరువైన సంఘటనలు ఇటీవల అనేకం వెలుగు చూశాయి. విద్యా నైపుణ్యాలను అందించి, వికాసానికి తోడ్పాడాల్సిన విద్యాలయ ప్రాంగణాలు కూడా అమ్మాయిల పట్ల అభద్రతా వలయాలుగా మారటం విచారకరం. ఒడిషాలో బిఇడి విద్యార్థిని ... తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న అధ్యాపకుడి మీద ఫిర్యాదు చేసినా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణం. బాధితురాలి ఆవేదనపై సంబంధిత అధికారులు, పోలీసులు తగు విధంగా స్పందించనప్పుడు – అది వేధించేవాడికి మరింత బలమవుతుంది. ధైర్యాన్ని కూడగట్టుకొని ఫిర్యాదు చేసిన బాధితురాలి ఆత్మస్థయిరాన్ని దెబ్బ తీస్తుంది.ఈ దుస్థితే భవిష్యత్తు లో ఉపాధ్యాయినిగా ఎదగాల్సిన విద్యార్థిని బలన్మరణానికి దారి తీసింది. ఫిర్యాదు చేసినప్పుడు స్పందించని కళాశాల యాజమాన్యంపైనా, అధికారుల పైనా ఒడిశాలో పెద్దఎత్తున నిరసన వ్యక్తమవు తోంది. విద్యార్థి సంఘాలు గురువారం రాష్ట్ర బంద్ పాటించాయి. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన ఇంటర్ విద్యార్థిని కళాశాలకు వెళ్లి, గండికోటలో అనుమానాస్పద స్థితిలో విగతజీవిగా కనిపించింది. ఏం జరిగిందో పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది. కొద్ది రోజుల క్రితం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పారా మెడికల్ విద్యార్థినులు... తమను ల్యాబ్ అసిస్టెంటు, మరో ముగ్గురు సిబ్బంది లైంగిక వేధింపులకు గురి చేస్తున్నట్టు– ఫిర్యాదు చేశారు. ఏలూరులోని స్పోర్ట్స్ అథారిటీ– ఆఫ్ ఇండియా కేంద్రంలో క్రీడాకారిణుల పట్ల కోచ్‌లు లైంగిక వేధింపులకు పాల్పడినట్టు– గత నెలలో వచ్చిన వార్తలు సంచలనం కలిగించాయి. చదువుకున్న చోట, శిక్షణ పొందుతున్న చోట విద్యార్థినులకు రక్షణ లేకపోవటం అత్యంత విచారకరం. తమ మాట వినకుంటే భవిష్యత్తుకు నష్టం కలిగిస్తామన్న బెదిరింపులతో కొంతమంది శిక్షకులు, అధ్యాపకులు, సిబ్బంది వికృత చేష్టలకు పాల్పడడం నిత్య కృత్యంగా మారుతోంది. ఇలాంటి వాటిపై కొద్దిపాటి సమాచారం తమ దృష్టికి వచ్చినా యాజమాన్యాలూ, అధికారులూ తక్షణ చర్యలు తీసుకోవాలి. ఏ పేరుతో ఆలస్యం చేసినా అది దుర్మార్గుల దుశ్చేష్టలకు ఊతమిచ్చినట్టే అవుతుంది. అలాగే, నేర నిరూపణ చేయటంలోనూ పోలీసు యంత్రాంగం తరచూ విఫలమవుతోంది. సంచలనం కలిగించిన ఆయేషా, రిషితేశ్వరి ఉదంతాలు రెంటిలోనూ నిందితులకు శిక్ష పడలేదు. దర్యాప్తులో చోటు– చేసుకునే వైఫల్యాలు కూడా నేర ప్రవర్తకులకు పరోక్ష ధైర్యాన్నిస్తాయి. ఈ విష సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే కఠిన శిక్షలు విధాల్సిందే. మరణశిక్షలకు సైతం వెనకాడరాదు. అలాగే చిన్నిప్పటి నుంచే విలువలతో కూడా పాఠ్యాం శాలు బోధించాలి. మన కుటంబ వ్యవస్థ గురించి బోధనలు జరగాలి. హితోపదేశాలకు సంబంధించిన పాఠాలు చెప్పాలి. మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లుగా మన పాఠ్యాంశాలను మార్చుకోవాల్సి ఉంది. ఉరుకులు పరుగుల జీవితంలో పిల్లల నడవడిని తల్లదండ్రులు పట్టించుకోవడం లేదు. మళ్లీ మన విద్యావిధానం, విలువలు, సంస్కృతి తదితర అంశాలనో బోధనగా చేర్చి మార్పునకు కృషిచేయాల్సి ఉంది. సమాజంలో టీచర్లు ముందుగా మారాలి. రాజకీయ నాయకులు, మేధావులు ఉత్తమ విద్యావిధానం కోసం పాటుపడాలి. అప్పుడే కొంతయినా మార్పు రాగలదు.

# జగన్ మాట మార్చుకోవాలి

## అజ్ఞానరహితంగా మాట్లాడితే సహించం బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఘాటు హెచ్చరిక

రాజమండ్రి,

వైకాపా అధినేత జగన్ మాట్లాడే విధానాన్ని మార్చుకోవాలని.. లేకపోతే తాము తగిన సమాధానం చెబుతామని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు హెచ్చరించారు. ఏపీలో తాము మళ్లీ అధికారంలోకి వస్తాం.. అధికారుల అంతం చూస్తామంటూ జగన్ అజ్ఞానరహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను జగన్ ఏమీ చేయలేరని వార్నింగ్ ఇచ్చారు. జగన్ ప్రభుత్వంలో ఉన్న అధికారులు జైలుకి వెళ్తున్నారని చెప్పుకొచ్చారు. ఇవా(శనివారం) రాజమండ్రిలోని బీజేపీ కార్యాలయంలో సోము వీర్రాజు మీడియాతో మాట్లాడారు. జగన్ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులకు ఆరోగ్యాలు పాడైపోయాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రూ.420కి నెయ్యి కొని తిరుపతిలో లడ్డూ తయారు చేశారని సోము వీర్రాజు ఆరోపించారు. అధికారంలోకి జగన్ మళ్లీ వస్తే నెయ్యి రూ.320కి కొంటారా అని ప్రశ్నించారు. జగన్ పరిపాలనలోని వైఫల్యాలనే తాను ప్రశ్నిస్తున్నానని అన్నారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు ఎందుకు జైలుకి వెళ్తున్నారో ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు. వైసీపీ పరిపాలన లోని లోపాలు ఆ పార్టీ నేతలకి అర్థం కావటం లేదా అని ప్రశ్నించారు. మంత్రి నారా లోకేష్ చేసిన యువగళం పాదయాత్రలో వైసీపీ నేతలు ఏం చేయించారో.. ఒకసారి రికార్డులు వెనక్కి తీయిస్తే వారు చేసిన అరాచకాలు బయటపడుతాయని చెప్పుకొచ్చారు. జగన్ ప్రతిపక్ష నేతగా కూటమి ప్రభుత్వాన్ని బెదిరిస్తే ప్రజలు మిమ్మల్ని నమ్మరని.. మళ్లీ మీరు అధికారంలోకి రావడం కళే అని విమర్శించారు సోము వీర్రాజు. 2029లో కూడా మళ్లీ కూటమి అధికారంలోకి వస్తుందని సోము వీర్రాజు జోస్యం చెప్పారు. వైసీపీ పాలనలో రోడ్డుపై ఒక్క గోయ్యి కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నించారు. జగన్ పాలనలో రమ్మీలు ఆడించారని ఆరోపించారు. గతంలో తనను గుడివాడ కూడా వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. తనకు రామతీర్థం నుంచి కపిలం తీర్థం వెళ్లటానికి కూడా జగన్ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. అప్పులు చేయటం జగన్‌కే బాగా తెలుసునని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో అప్పటి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రోజూ ఢిల్లిలో ఎందుకు ఉండేవారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీపై ఉన్న గౌరవమే తెలంగాణపైనా ఉందని స్పష్టం చేశారు. ఏపీలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు బనకచర్లకు అనుకూలంగా మాట్లాడాలని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు కోరారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# పదవీకాంక్ష- ప్రజల పట్ల ఉదాసీనత

ఆంధ్ర రాజకీయ నాయకులను చూస్తే ఆశ్చర్యమేస్తుంది. వారి ఒక చర్య వల్ల కలిగిన ఆశ్చర్యం నుంచి తేరుకోకుండానే మనల్ని ఇంకా ఆశ్చర్యపరిచే పని ఇంకోటి చేస్తారు. ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని చూడండి. మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడే ప్రపంచంలో లేని ఇంద్రుడి నగరం లాగా నిర్మిస్తానని 54 వేల ఎకరాలు పోగేశాడు. ఆ ప్రాంతం పెరిగిపోయినట్టు త్రీడి వీడియోలు తీసి, అయిదేండ్లు అవి చూపిస్తూ కాలం గడిపాడు. 400 ఏండ్ల నుంచి ప్రపంచంలోని అత్యంత సుందర నగరాలలో ఒకటైన హైదరాబాద్‌ను తానే నిర్మించానని పదే పదే చెప్పటంతో నిజాము రాష్ట్రం గురించి తెలియని ఆంధ్ర జనాలు తమకు అత్యద్భుత రాజధాని రాబోతోందన్న భ్రమలో మునిగిపోయారు. అయితే అక్కడ నాలుగేండ్లలో కనీసం 3 పక్కా భవనాలు-శాసనసభకు, శాసనమండలికి, హైకోర్టుకు కూడా కట్టలేకపోయాడు. పొత్తు ముచ్చటలో నరేంద్ర మోదీ 16 వేల కోట్లిచ్చినా ఆ భవనాల జాడ లేదు. తమకు జరిగిన నష్టాన్ని తలుచుకుంటూ 29 పల్లెల రైతులు విచారంలో మునిగి ఉంటే అందరినీ ఆశ్చర్యపరిచే ఇంకొక ప్రకటన చేశాడు విజనరీ ముఖ్యమంత్రి. అదేమిటంటే %-% 2014లో అమరావతి, 2024లో క్వాంటమ్ వ్యాలీ! ఇప్పుడు ఒక కొత్త విజన్ ప్రసాదించారు చంద్రబాబు. కొత్తగా ఉద్యోగాలు మింగేస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి తోడుగా క్వాంటమ్ వ్యాలీ సృష్టించటానికి ఇంకో 44 వేల ఎకరాలు రైతులు త్యాగబుద్ధితో ప్రసాదిస్తే, తాను లక్ష ఉద్యోగాలు ఇస్తానని ప్రకటనలు చేస్తున్నాడు హైర్ ఎండ్ ఫైర్ విజన్ ప్రవేశపెట్టిన నారా నాయుడు! ఈ ఆశ్చర్యం నుంచి ప్రజలు తేరుకునే లోపలే వేల ఎకరాలు ఆయన ఖాతాలో పడుతాయి. ఇక నాలుగేండ్లు పూర్తవుతాయి. ఆశించిన సంపాదన పూర్తయ్యాక ఎన్నికల సంగతి తర్వాత! అప్పుడు ఇంకో కొత్త విజన్ పుట్టుకువస్తుంది. విజన్లకు లోటు లేదు, వర్క్ లేదు కానీ! సరిగ్గా ఆయన పూర్వీకులు కూడా ఇలాంటి కథలు చెప్పి ఆంధ్ర ప్రజలను 1953 నుంచి 1956 దాకా వంచించారు. 1912న ఏర్పడిన ప్రత్యేక రాష్ట్ర కోరిక 1914లో ఒక ఉద్యమంగా మొదలుపెట్టి 1913 నుంచీ సభలు, సమావేశాలు, నెహ్రూగారికి వినతుల లేఖలు సమర్పించిన నాయకులు, 1950లో రాష్ట్ర ప్రకటన జరిగినా ముఖ్యమంత్రి పదవి తనకు రాదని టంగుటూరి ప్రకాశం, ఆ అవకాశాన్ని భగ్నం చేశాడు, మద్రాసు ఇవ్వకపోతే రాష్ట్రం వద్దు అని! అసలు ప్రజల మీద ఏ మాత్రం అభిమానం ఉన్న నాయకుడైనా అట్లా ప్రవర్తిస్తాడా? ఆనాడు ఒప్పుకొని ఉంటే త్యాగధనుడు పొట్టి శ్రీరాములుని కాపాడగలిగేవారు కదా! ఆంధ్ర రాజకీయ నాయకుల స్వార్థం ముందు ప్రజా సంక్షేమం ఎప్పుడూ ఓడిపోతూనే ఉంది! శ్రీరాములు కూడా ప్రత్యేక రాష్ట్రం కోసమే దీక్ష ముఖ్యంగా చేశారు కానీ, మద్రాసు కోసం మాత్రం కాదని 13 డిసెంబర్ ఆంధ్ర పత్రికలో సంపాదకీయం రాసింది. అంటే శ్రీరాములు గారి ఆరోగ్యం క్షీణిస్తూ ఉండటంతో ఆయన మరణాన్ని కూడా రాజకీయ అవసరాల కోసం వాడుకోవచ్చని అనుకొని ఉండచ్చు అప్పటి రాజకీయ నాయకులు! కాంగ్రెస్ పార్టీ సభ్యుడే కాకపోయినా టంగుటూరి ప్రకాశం, శ్రీరాములు చితి మీంచి నడిచి ముఖ్యమంత్రి సింహాసనమెక్కాడు. డిసెంబర్ 9 నుంచి శ్రీరాములు ఆరోగ్యం ప్రమాదకర పరిస్థితిలో ఉన్నా, రాష్ట్రం కోసం పోరాడే యోధులెవరూ అది పట్టించుకోలేదు. తర్వాత కూడా మద్రాసు హైకోర్టు ఉమ్మడిగా సాగినా, రాజధాని కర్నూలును సవతి పిల్లాడిగా చూశారే కానీ, ఆ పట్టణంలో కనీస అవసరాలు కల్పించటానికి పూనుకోలేదు ముఖ్యమంత్రి, తదితరులు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నీలం సంజీవరెడ్డి 'హైదరాబాద్ రాజధానిగా విశాలాంధ్ర సాధించాలనీ, కర్నూలు కేవలం తాత్కాలిక గుడారమే'నని ప్రకటించడం వారికి తమ ప్రాంతం మీద ఉన్న నిర్లక్ష్యం, పక్కవాడి సంపద మీద ఉన్న దురాశ తేటతెల్లం చేస్తోంది. విశాలాంధ్ర వాదం సామాజిక స్పృహ ఉన్న నెహ్రూకి నచ్చలేదు. అందులో ప్రాంతాన్ని ఆక్రమించాలనే సామ్రాజ్యవాదం ఉంది అని ఆయన అభిప్రాయపడ్డారు. ఆ అభిప్రాయం నిజమేనని తర్వాతి కాలం నిరూపించింది. సుందర భాగ్యనగరం, పారుతున్న గోదావరి (560 కిలోమీటర్లు), కృష్ణా (305 కిలోమీటర్లు), భారతదేశంలో ఏ రాష్ట్రం, ఏ ప్రాంతంలో ఇవ్వనంత జీతాలు, ఉద్యోగులకు ఇచ్చే సంపద, నల్లరేగడి భూములు. ఖర్చు తర్వాత మిగులుతున్న కోట్ల నిధులు, విలువైన ప్రభుత్వ, కాందిశీకుల భూములతో అలరారుతున్న వస్త్ర, కాగితం హైడ్రో ఎలక్ట్రిసిటీ, సిరులొలికే చక్కెర వంటి పంటలు, చెక్కర ఫ్యాక్టరీ, ఇంకా చిన్న పరిశ్రమలు ఇవన్నీ చూసి కండ్లు కుట్టిన ఆంధ్ర నాయకులకు, తమ సొంత ప్రాంతంలో కష్టపడి రాజధానిని కట్టుకోవటం దండుగనిపించింది. కష్టించి సంపాదించటం కంటే పక్కవాడిది కొట్టేయడం తేలిక. 'ఆ కష్టమేదో నెహ్రూని ఒప్పించి విశాలాంధ్ర సాధిస్తే మిగతా కష్టాలుండవు కదా' అని మద్రాసు కొట్టేసే పథకం విఫలమైన నిరాశలో ఉన్న ఆంధ్ర రాజకీయ నాయకుల వక్రబుద్ధి మళ్ళీ తీక్షణంగా వికసించింది. దీనికి తోడు రాజ్యాంగం రాసుకున్నాక, వివిధ రాష్ట్రాలలో ఉన్న చిన్న చిన్న సంస్థానాలను భారతదేశంలో కలుపుకొన్నాక, భాషా ప్రయుక్త (ప్రజల భాషలననుసరించి రాష్ట్ర సరిహద్దులనేర్పరచడం) రాష్ట్రాలు సాధ్యమవుతాయా అని ఆలోచించింది కేంద్రం. నిజానికి విదేశీ దండయాత్రలు జరుగకముందు భారతదేశం ఎప్పుడూ ఒక దేశంగా లేదు. త్రేతాయుగంలో రామరాజ్యం రష్యా అవతలిదాకా విస్తరించినట్టు చెప్తారు. కానీ, ద్వాపరయుగం వచ్చేటప్పటికి ప్రపంచమంతా 54 దేశాలుగా ఉన్నట్టు మహాభారత చరిత్రలో తెలుస్తుంది. ఆ దేశాల పేర్లు, పాలించిన వంశాలు, వాటిలోని రాజుల పేర్లు అవీ వ్యాస మహర్షి రచించిన మహాభారతంలో దొరుకుతాయి. కొన్ని పేర్లు వేదాలలో ఉన్న విజ్ఞాన భాగంలో ఆయా ఋషులు చెప్పారు. ఉదాహరణకు, సూర్యోదయ, సూర్యాస్తమయాలు అనేవి ఉండవనీ, సూర్యుడు ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటాడనీ, భూమి కదలికలను బట్టి ఒక్కో సమయంలో ఒక్కో ప్రాంతంలో కనిపిస్తాడని ఖగోళ, గణిత శాస్త్రజ్ఞుడు ఆర్యభట్టు చెప్పాడు. ఉదయోయో లంకాయాం సోస్థమయః సవితురేవ సిద్ధపురే! మధ్యాహ్నో యమకోట్యాం రోమక విషయేర్ధ రాత్రాహ శ్యాత్!!(పొద్దున్న సూర్యుడు లంకలో కనిపించి, తర్వాత సిద్ధపురానికి, మధ్యాహ్నం యమకోటికి కనిపించి రాత్రయేసరికి రోమ్ నగరంలోకి వస్తాడు, అంటే సూర్యుడు రాడు, భూమి కదలికల వల్ల ఒక్క సమయంలో ఆయా నగరాల్లో ఆయా రకంగా ఉంటది' అని అర్థం)విదేశీయుల కాలంలో ముఖ్యంగా ఔరంగజేబు పరిపాలనలో దక్షిణానికి కూడా విస్తరించిన రాజ్యం ఇంగ్లీషు వాళ్ల పరిపాలనలో పూర్తిగా ఒక్క దేశంగా ఏర్పడింది. సంస్కృతిపరంగా, దేశమంతా ఒక్కలా ఉన్నా, భాషలు వాటి సాహిత్యాలన్నీ పూర్తిగా ఏర్పడిపోయి ఉన్నాయి. అవి మారలేదు. ఈ విషయం ఇప్పుడు ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, మన దేశం కూడా అమెరికా లాగ రాష్ట్రాల సమాఖ్య లాగ ఉండాలి. ఇన్ని శతాబ్దాలలో ఏర్పడిన వైవిధ్యాలు అలాగే కాపాడుకోవాలి. ఇప్పటి ప్రధానమంత్రి ప్రవచిస్తున్నట్టు ఒకే దేశం, ఒకే భాష లాంటి తెలివి తక్కువ నినాదాలు వ్యతిరేకించాలి. ఆయన రోజూ ఒకే కూర తిని, ఒకే సూటు వేసుకుంటాడా? ఇంత ఉపోద్ఘాతం ఎందుకంటే, 58 సంవత్సరాలు కలిసి ఉన్నా ఆంధ్ర, తెలంగాణ మధ్య భావసమైక్యత ఏర్పడలేదు. పైన చెప్పినటువంటి తేడాలు రెండు ప్రాంతాల సంస్కృతి, చరిత్ర, భాషలు, భావాలలో ఉండటమే కారణం. ఇది తర్వాతి వ్యాసంలో వస్తుంది. కేవలం భాషలు ఒకటే అని వాటిగురించి ఏమీ తెలియని నెహ్రూని మోసం చేసి, బలవంతపెట్టి, 1953 అక్టోబర్‌లో ఏర్పడి 1956 వచ్చేసరికి తమ ప్రాంతం అభివృద్ధి చేసుకోకుండా హైదరాబాద్ మీద కన్నువేసి ఫజల్ అలీ కమిషన్ సిఫారసుకి వ్యతిరేకంగా ఈ రెండు ప్రాంతాలనీ కలిపి ఉమ్మడి ఏపీగా చేయగలిగారు ఆంధ్ర రాజకీయ నాయకులు. ఫజల్ అలీ కమిషన్ ఏమి చేసింది, అంతిమంగా ఏ సిఫారసులు చేసిందన్న వివరాలు వచ్చే వ్యాసంలో చర్చిద్దాం. ఈ ప్రాంతాల కలయిక రెండు విషయాల వల్ల జరిగింది. ఒకటి, స్వాతంత్ర్యోద్యమం నుంచీ నెహ్రూ, గాంధీలతో ఆంధ్ర నాయకులకు పరిచయాలుండేవి. అందుకే వారి మాట ఎక్కువగా చెల్లేది. కానీ, బ్రిటిష్ వారితో సంబంధం లేకుండా, నిజాం రాష్ట్రంలో ఉన్న నాయకులకు కేంద్రం నాయకులతో అంత చనువు లేదు. రెండో కారణం, ప్రపంచమంతా తెలిసి జైలు నిర్బంధం వచ్చినప్పుడల్లా తన కూతురికి ఇండియా గురించి ఉత్తరాలు రాసిన నెహ్రూకి ఈ రెండు ప్రాంతాల గురించి అవగాహన లేదనే చెప్పాలి. ఈ ప్రాంతాల భాషలైన తెలుగు, ఆంధ్రం ఒక్కటేనని నమ్మించగలిగారు ఆంధ్ర నాయకులు.

# ఆర్థికాభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి



- ఐసిఏఐ అత్యంత గౌరవనీయమైన సంస్థ
- ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్
- రానున్న మూడేళ్లలో ఏపిలో మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యం
- అభివృద్ధిలో పోటీపడడమే మా కర్తవ్యం
- రాజకీయ ఘర్షణలు మా అభిమతం కాదు



## ఐసిఏఐ గుంటూరు చాప్టర్ సమావేశంలో మంత్రి లోకేశ్

**గుంటూరు**

ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిదని.. ఐసిఏఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ యవ్వనంగానే ఉందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ అన్నారు. ఈ సంస్థ భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్‌గా ఉందన్నారు. గుంటూరు బండ్లమూడి గార్డెన్స్ లో ఐసిఏఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన స్ఫూర్తి పేరుతో నిర్వహించిన మెగా సిఎ విద్యార్థుల సమావేశానికి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఐసిఏఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ ఇదని.. ఐసిఏఐ ద్వారా 10లక్షలమందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా, ప్రతిఏటా 2లక్షలమంది పరీక్షలు రాస్తున్నారన్నారు. 4.07 లక్షల మంది సభ్యులు, 54 విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థ ఐసిఏఐ. వ్యాపారం ఎక్కడ ఉంటే భారత్ అక్కడ ఉంటుందని.. భారత్ ఎక్కడ ఉంటే అక్కడ ఐసిఏఐ ఉంటుందని లోకేష్ అన్నారు. తాను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్‌గా సిఎ ప్రాధాన్యత తెలుసన్నారు. సౌత్ ఆసియా లోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోంది. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఇ-గవర్నెన్స్, ఐటీ- హబ్‌లతో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన చంద్రబాబునాయుడు... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపి రూపురేఖలు మార్చబోతున్నారు. మేం మార్పుకోసం వేచిచూడకుండా ఇక్కడ నుంచే మార్పునకు శ్రీకారం చుడుతున్నాం. పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రాలతో పోటీపడుతున్నాం. అభివృద్ధి కోసం పోటీపడ తామే తప్ప.... రాజకీయ ఘర్షణ మా అభిమతం కాదు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ముందుకు వెళ్తున్నాం. కర్నూలులో డ్రోన్ సిటీ-, కడపలో స్టీల్ ఎ÷-లాంట్, విశాఖలో ఏ ఎన్ ఎస్ ఆర్, సత్వ జిసిసితో పాటు- ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు- రాబోతున్నాయి. నేను విజనరీ లీడర్ చంద్రబాబు గారినుంచి స్ఫూర్తి పొందాను. ఆయన 75ఏళ్ల వయసులో 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తున్నారు. మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ, ఐటి, ఫార్మా... అన్ని రంగాల్లో ఏపీని నెం.1 గా నిలపాలన్నదే మా లక్ష్యం. రాబోయే మూడేళ్లలో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తెచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నా. యువత రాజకీయాల్లోకి రావాలి, తెలుగుదేశం పార్టీ యువత, విద్యావంతులను ప్రోత్సహిస్తుంది. మహిళా సాధికారిత ద్వారానే సమాజాభి వృద్ధి సాధ్యం. మార్పు మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. 1992లో చంద్రబాబు గారు ప్రారంభించిన హెరిటేజ్ ను నా తల్లి భువనేశ్వరి, భార్య బ్రహ్మణి సమర్థవంతంగా నిర్మిస్తున్నారు. నేటి ప్రపంచంలో, ఐక్యూ మంచిది, ఈక్యూ మంచిది. కానీ టిక్యూ కూడా తప్పనిసరి. పదునుగా, నైతికంగా, తాజాగా ఉండండి. మీరే మా పెట్టుబడి. లక్ష్యసాధనపై దృష్టి కేంద్రీకరించి, ఆచరణాత్మకంగా, సానుకూలంగా ఉండండి. మీరు ఎంచుకున్న ప్రయాణం కష్టమైందే కానీ మీకు బంగారు భవిష్యత్తు ఉంటుంది. సీనియర్లు, మెంటర్లు, మెరుగైన ఎకోసిస్టమ్ ద్వారా మెళుకువలు నేర్చుకోండి. మీ తల్లిదండ్రులు మిమ్మల్ని నమ్ముతారు, మేము మిమ్మల్ని నమ్ముతాము. సిఎ ఉత్తీర్ణత సాధించడం కేవలం ఒక మైలురాయి కాదు, ఇది మీ జీవితానికి మణిహారం లాంటిది. నిద్రపోతున్న వారిని మేల్కొల్పండి, దేశాన్ని మేల్కొల్పండి అన్నది ఐసిఏఐ నినాదం. భారతదేశ ఆర్థికవ్యవస్థకు మీరే గుండెకాయ. సిఏలు పాలనా వ్యవస్థలోకి వస్తే అవినీతిని రూపుమాపడం సులభతరమవుతుంది. మనమంతా కలసి భారతదేశాన్ని, ఆంధప్రదేశ్ ను ప్రగతిపథం వైపు నడిపిద్దాం. భవిష్యత్తు మీది, లక్ష్యం మాది, ప్రభుత్వం మీతో ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి అవసరమైన విధానాల రూపకల్పనలో సిఏలు భాగస్వాములు కావాలని మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక కోర్సు కాదు, నిబద్ధత కూడుకున్న విద్య అన్నారు. మా కుటుంబ వ్యాపారాల్లో సిఏల కష్టాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. వ్యాపారాల్లో స్పష్టత లోపించినపుడు మేము సిఎ వైపే చూస్తాము. పాలనా వ్యవస్థలో బడ్జెట్ ఆమోదం ఉన్న ప్రతి ప్రభుత్వ ఫైల్‌కు ఆడిటర్ల ఆమోద ముద్ర అవసరం. వ్యవస్థపై నమ్మకం కోసం మేము చార్టర్డ్ అకౌంటెంట్‌పై ఆధారపడతాం. సీఏలు కేవలం సంఖ్యా విశ్లేషకులు మాత్రమే కాదు, వారు ఆర్థిక వృద్ధి చోదకులు. వారు వ్యాపారాలకు మూలధనాన్ని సేకరించడానికి, ఉద్యోగాలను సృష్టించడానికి సహాయం చేస్తారు. సేకరించిన ప్రతి రూపాయి, సృష్టించ బడిన ప్రతి ఉద్యోగం కథలో సీఏ పాత్ర ఉంటుంది. మా ప్రభుత్వం సీఏల ఇన్‌పుట్‌లకు విలువ ఇస్తుంది, పాలనా నిర్ణయాలలో మేము సీఏలను సంప్రదిస్తాము. మీరు బ్యాలెన్స్ షీట్‌లను మాత్రమే ధృవీకరించరు, రాష్ట్ర ఆర్థిక వెన్నెముకను తయారు చేస్తారు. న్యూ ఏజ్ సీఏ అనేది కాలిక్యులేటర్ కంటే ఎక్కువ. నేటి సీఏలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచవ్యాప్తంగా అవగాహన, ఎఐ ఆధారిత కమ్యూనికేషన్, నైతికత కలిగి ఉండాలని సూచించారు. భారతదేశ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఫ్యాక్టరీ గుంటూరు నగరం అని, ఆశ్చర్యకరంగా గుంటూరు సిటీ- వైద్యులు, ఇంజనీర్లకంటే ఎక్కువగా సిఏలను తయారుచేస్తోంది. డాక్టర్లు, ఇంజనీర్లకంటే సిఏ చదువుతున్న 10వేలమంది విద్యార్థుల సంఖ్య ఎక్కువ. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణత శాతంతో సమున్నత లక్ష్యాలు కలిగిన చార్డర్డ్ అకౌం-టె-ంట్లు- గుంటూరుకే సొంతం. గుంటూరు నుండి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు ఈఆలు భారతదేశం గర్వపడేలా ప్రతిభను చాటు-తున్నారు. సిఎ వృత్తిలో ప్రవేశించడం కష్టం, విస్మరించడం అసాధ్యం. సిఎ కోర్సు కష్టతరమైనది అయినప్పటికీ యువతను ఉన్నత శిఖరాల్లో నిలబెడుతుంది. వజ్రాన్ని తయారుచేయడం ఎంతకష్టమో సిఎ డిగ్రీ సాధించడం కూడా అంతే కష్టం అన్నారు. సిఎ వృత్తిపన్నులు, చట్టం, బ్యాంకింగ్, పెట్టుబడులు, సాంకేతికత, విధానం వంటి రంగాల్లో విస్తరించి ఉంది. ప్రతి బ్యాలెన్స్ షీట్ వెనుక ఒక టాలెంట్ బ్రెయిన్ ఉంటుందన్నారు. గతంలో 10 నుంచి 12శాతం వరకు వృద్ధి రేటు సాధించిన మనం, నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోవడానికి భవిష్యత్తులో 15శాతం వరకు వృద్ధిరేటు- సాధించాల్సి ఉంటుంది. ఈ మహోన్నత లక్ష్యసాధనలో చార్టర్డ్ అకౌంటెంట్లు- కీలకపాత్ర వహించాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఐసిఏఐ వైస్ ప్రెసిడెంట్ డి.ప్రసన్నకుమార్, సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ముప్పాళ్ల సుబ్బారావు, గుంటూరు బ్రాంచి చైర్మన్ ఎన్.రాజశేఖర్, సదరన్ ఇండియా చార్టర్డ్ అకౌంటెంట్స్ స్టూడెంట్స్ అసోసియేషన్ గుంటూరు బ్రాంచ్ చైర్మన్ చింతా రఘునందన్, వైస్ చైర్మన్ బి.ఝాన్సీ లక్ష్మి, కార్యదర్శి వనిమిరెడ్డి పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

స్పోర్ట్స్



# పంత్ మాంచెస్టర్ టెస్ట్ ఆడతాడా?

## ఫిట్‌నెస్ పై నెలకొన్న సందిగ్ధత



లార్డ్స్ టెస్ట్‌లో 22 పరుగుల తేడాతో ఓడిపోయిన తర్వాత, భారత జట్టుకు మరో ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, జట్టు స్టార్ వికెట్ కీపర్-బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ వేలికి గాయం. ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్ట్ సందర్భంగా జస్ప్రీత్ బుమ్రా వేసిన బౌన్సర్ పంత్ వేలికి తగిలింది, దీని కారణంగా అతను మొత్తం మ్యాచ్‌లో వికెట్ కీపింగ్ చేయలేకపోయాడు. ఇప్పుడు మాంచెస్టర్ టెస్ట్‌కు ముందు అతని ఫిట్‌నెస్ గురించి సందిగ్ధత నెలకొంది. టీమ్ ఇండియా సహాయక కోచ్, రయాన్ టెన్ డోషెట్ గురువారం నాడు పంత్ ఫిట్‌నెస్ గురించి అప్‌డేట్ ఇచ్చారు. మాంచెస్టర్ టెస్ట్‌కు ముందు పంత్ నెట్స్‌లో బ్యాటింగ్ చేస్తాడని, అయితే అతని వికెట్ కీపింగ్ పరిస్థితి ఇంకా స్పష్టంగా లేదని ఆయన స్పష్టం చేశారు. టెన్ డోషెట్ మాట్లాడుతూ, “రిషబ్ లార్డ్స్ టెస్ట్‌లో వేలికి గాయంతో రెండు ఇన్నింగ్స్‌లలోనూ బ్యాటింగ్ చేశాడు. ఇప్పుడు అతని వేలి గాయం కాస్త తగ్గింది. మునుపటి కంటే మెరుగ్గా ఉంది. అతను మాంచెస్టర్‌లో అందుబాటులో ఉంటాడని మేము ఆశిస్తున్నాము. బ్యాట్స్‌మెన్‌గా అతని ఆడటం దాదాపు ఖాయం, కానీ కీపింగ్ గురించి తుది నిర్ణయం త్వరలో తీసుకుంటాం.” అని అన్నారు. లార్డ్స్ టెస్ట్‌లో గాయపడిన రిషబ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు, దీనివల్ల భారతదేశం ప్లేయింగ్ 11లో సమతుల్యత దెబ్బతింది. జట్టు నిర్వహణ ఇప్పుడు అలాంటి పరిస్థితులను మళ్లీ కోరుకోవడం లేదు. అందుకే పంత్ వికెట్ కీపింగ్ విషయంలో ఎటువంటి రిస్క్ తీసుకోకూడదని భావిస్తున్నారు. టెన్ డోషెట్ మాట్లాడుతూ, “కీపింగ్ అతనే చేయాలని అనుకుంటున్నాం. మ్యాచ్ మధ్యలో జట్టు మళ్లీ కీపర్‌ను మార్చాలని మేము కోరుకోవడం లేదు. అందుకే మేము జాగ్రత్తగా ఉంటున్నాం.” అని అన్నారు. ఇప్పుడు ఉన్న సమాచారం ప్రకారం, రిషబ్ పంత్ తన గాయంతో ఎటువంటి ప్రాక్టీస్ చేయలేదు. వేలికి విశ్రాంతి ఇవ్వడం మంచిదని భావించాడు. మాంచెస్టర్ టెస్ట్‌కు ముందు పూర్తిగా ఫిట్‌గా ఉండటమే దీని లక్ష్యం. అతను ఫిట్‌గా ఉంటే, మాంచెస్టర్ టెస్ట్‌లో ఆడతాడు. రెండు పాత్రలను(కీపింగ్, బ్యాటింగ్) పోషించవచ్చు. ప్రస్తుతం భారత్ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకబడి ఉంది. అటువంటి పరిస్థితిలో, పంత్ ఉండటం జట్టుకు నిర్ణయాత్మకంగా మారవచ్చు, అది బ్యాట్‌తో పరుగులు సాధించడం లేదా స్టంప్స్ వెనుక అద్భుతాలు చేయడం. మాంచెస్టర్ టెస్ట్ ప్లేయింగ్ 11లో పంత్ పేరు దాదాపు ఖాయమని భావిస్తున్నారు, కానీ అతను వికెట్ కీపింగ్ కూడా చేస్తాడా, లేదా జట్టు మరే ఇతర ప్రత్యామ్నాయంతో బరిలోకి దిగుతుందా? తుది ఫిట్‌నెస్ పరీక్ష తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకుంటారు. భారత జట్టు ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడ్డాడు. సాయి సుదర్శన్ బంతిని అర్ష్‌దీప్ వైపు ఆడాడు, ఆపడానికి ప్రయత్నిస్తుండగా అతని ఎడమ చేతికి గాయమైంది. టీమ్ ఇండియా అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డోస్చేట్ అర్ష్‌దీప్ గాయాన్ని ధృవీకరించాడు. డ్యూచ్ మాట్లాడుతూ, ‘బౌలింగ్ చేస్తున్నప్పుడు బంతి అతని(అర్ష్‌దీప్) చేతికి తగిలింది. బంతిని ఆపడానికి ప్రయత్నిస్తుండగా అర్ష్‌దీప్ చేయికి గాయపడింది’ అని అన్నారు. అసిస్టెంట్ కోచ్ ఇంకా మాట్లాడుతూ, ‘గాయం ఎంత పెద్దతో చూడాలి. వైద్య బృందం అతన్ని డాక్టర్ వద్దకు తీసుకెళ్లింది, అతనికి కుట్లు అవసరమా లేదా అని చూద్దాం. రాబోయే కొన్ని రోజులు మన తదుపరి ప్రణాళికకు ముఖ్యమైనవి కానున్నాయి’. అన్నారు.



# నితీశ్ కుమార్ రెడ్డికి కెప్టెన్?గా ప్రమోషన్

ఇంగ్లాండ్ పర్యటనలో టీమ్‌ఇండియా స్టార్ ఆల్ రౌండర్ నితీశ్? కుమార్ రెడ్డి ఆకట్టుకుంటున్నాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో బ్యాటింగ్‌లో నితీశ్? రెడ్డి నుంచి ఆశించిన స్థాయిలో ఇన్నింగ్స్? రాకపోయినా, బౌలింగ్‌లో మాత్రం అదరగొడుతున్నాడు. జట్టుకు అవసరమైనప్పుడు వికెట్ పడగొట్టి బ్రేక్ ఇస్తున్నాడు. ఈ క్రమంలో మాంచెస్టర్ టెస్టులోనూ నితీశ్ జట్టులో ఉండడం ఖాయంగా కనిపిస్తుంది. ఇదిలా ఉండగా, నితీశ్?కు మరో అద్భుతమైన అవకాశం వచ్చింది. అతడు తాజాగా కెప్టెన్?గా ఎంపికయ్యాడు. ఇక నితీశ్ కూడా కెప్టెన్?గా జట్టును ముందుకు నడిపించనున్నాడు. మరి నితీశ్ కెప్టెన్?గా ఎలా ఎంపికయ్యాడు. రీసెంట్?గా అతడిని భీమవరం



బుల్స్ జట్టు కొనుగోలు చేసింది. అంతేకాకుండా తననే జట్టుకు సారిథిగా నియమించింది. ఇకపై ఆంధ్ర ప్రీమియర్ లీగ్?లో భీమవరం కెప్టెన్?గా? నితీశ్ రెడ్డి మనకు కనిపించనున్నాడు. ఈ నేపథ్యంలోనే అతడు ఓ అరుదైన ఘనత సాధించాడు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్న రెండో అతిపిన్న వయస్కుడిగా నిలవనున్నాడు. ప్రస్తుతం నితీశ్ వయసు 22 సంవత్సరాలు. నితీశ్ కంటే ముందు షేక్ రషీద్ ఈ లీగ్‌లో అతి పిన్న వయస్కుడైన కెప్టెన్?గా కొనసాగుతున్నాడు. అతడు 19 సంవత్సరాల వయసులో ఆంధ్ర లీగ్?లో కెప్టెన్ అయ్యాడు. అయితే ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో మొత్తం 7 జట్లు పాల్గొంటున్నాయి. ఇందులో భీమవరం బుల్స్, అమరావతి రాయల్స్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ, కాకినాడ కింగ్స్, తుంగభద్ర వారియర్స్, వైజాగ్ లయన్స్, విజయవాడ సన్‌షైనర్స్ ఉన్నాయి. ఈ టోర్నమెంట్ ఆగస్టు 8, 2025న ప్రారంభమవుతుంది. ఈ మొత్తం టోర్నమెంట్ దాదాపు 2 వారాల పాటు కొనసాగుతుంది. ఆగస్టు 24న జరగనున్న ఫైనల్?తో 2025న ఎడిషన్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ముగుస్తుంది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 19 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లన్నీ విశాఖపట్నంలోని వై.ఎస్. రాజశేఖర రెడ్డి క్రికెట్ గ్రౌండ్‌లో జరుగుతాయి. ఇది 2022లో ప్రారంభమైంది. ఇప్పటివరకు మూడు విజయవంతమైన ఎడిషన్‌లను పూర్తి చేసింది. ఈ మూడు ఎడిషన్‌లలో, కోస్టల్ రైడర్స్, రాయలసీమ కింగ్స్, వైజాగ్ వారియర్స్ టైటిల్‌ను గెలుచుకున్నాయి.

# చరిత్ర సృష్టించే దిశగా రిషబ్ పంత్


ఇంగ్లాండ్?తో నాలుగో టెస్టుకు టీమ్‌ఇండియా సిద్ధమవుతోంది. జూలై 23న ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈ సిరీస్?లో 2-1తో వెనకబడ్డ భారత్ నాలుగో మ్యాచ్?లో నెగ్గి సిరీస్?ను సమం చేయాలని భావిస్తోంది. ప్రస్తుత సిరీస్?లో టీమ్‌ఇండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ఇప్పటికే రెండు సెంచరీలు సహా 425 పరుగులు చేశాడు. ఈ క్రమంలో నాలుగో టెస్టులో పంత్?ను పలు రికార్డులు ఊరిస్తున్నాయి. ప్రస్తుతం నాలుగో ఎడిషన్ వరల్డ్?టెస్టు ఛాంపియన్?షిప్ టోర్నమెంట్ నడుస్తోంది. ఇందులో టీమ్‌ఇండియా సీనియర్ ప్లేయర్ రోహిత్ శర్మ రికార్డును పంత్? బ్రేక్ చేసే ఛాన్స్ ఉంది. మొత్తం డబ్ల్యూటీసీ హిస్టరీలో అత్యధిక పరుగులు బాదిన బ్యాటర్?గా రోహిత్ శర్మ టాప్?లో కొనసాగుతున్నాడు. రోహిత్ 69 ఇన్నింగ్స్?లో 2716 పరుగులు చేశాడు. ఈ లిస్ట్?లో రిషభ్? 2677 (66 ఇన్నింగ్స్??) పరుగులతో రెండో స్థానంలో ఉన్నాడు. అయితే పంత్ మరో 40 పరుగులు బాదితే డబ్ల్యూటీసీలో అత్యధిక పరుగులు బాదిన టీమ్‌ఇండియా బ్యాటర్?గా టాప్?లోకి దూసుకెళ్తాడు. ప్రస్తుతం పంత్ ఉన్న ఫామ్?లో 40 పరుగులు బాదడం పెద్ద విషయమేమీ కాదు. నాలుగో టెస్టులోనే ఈ ఘతన సాధించే ఛాన్స్ ఉంది. మాంచెస్టర్ టెస్టులో పంత్ ముంగిట 61ఏళ్ల రికార్డ్ బ్రేక్ చేసే ఛాన్స్ ఉంది. ఓ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన భారత వికెట్ కీపర్ బ్యాటర్?గా రికార్డ్ కొట్టే అవకాశం ఉంది. 1964లో భారత్- ఇంగ్లాండ్ టెస్టు సిరీస్?లో టీమ్‌ఇండియా బ్యాటర్ బుద్ధి కుందరాన్ 10 ఇన్నింగ్స్?లో 525 పరుగులు చేశాడు. అప్పట్నుంచి ఓ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన భారత కీపర్?గా కుందరాన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అలాగే టెస్టు సిరీస్?లో 500o రన్స్ చేసిన ఏకైక భారత వికెట్ కీపర్?గానూ కుందరాన్ ఉన్నాడు. ఇక పంత్ ఈ సిరీస్?లో ఇప్పటికే 6 ఇన్నింగ్?ల్లో 7.80 యావరేజ్?తో 425 పరుగులు చేశాడు. మిగిలిన రెండు టెస్టుల్లో ఇంకో 101 రన్స్ నమోదు చేస్తే పంత్ 61ఏళ్ల రికార్డ్?ను బ్రేక్ చేసినట్లవుతుంది. టెస్టు సిరీస్?లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన వికెట్ కీపర్ బ్యాటర్?గా రికార్డ్ సృష్టిస్తాడు. అంతేకాకుండా ఓ టెస్టు సిరీస్?లో వికెట్ కీపర్ బ్యాటర్ బాదిన అత్యధిక పరుగులు 606. సౌతాఫ్రికా- ఆస్ట్రేలియా 1966-67 టెస్టు సిరీస్?లో సఫారీ వికెట్ కీపర్? డెనిస్ లిండ్సే 5 మ్యాచ్?ల్లో 606 రన్స్ చేశాడు. అప్పట్నుంచి ఓ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగు బాదిన బ్యాటర్?గా వరల్డ్ రికార్డ్ డెనిస్ పేరిటే ఉంది. ఈ సిరీస్?లో పంత్ మరో 182 రన్స్ చేస్తే, ఈ ప్రపంచ రికార్డ్ సైతం తన పేరిట లిఖించుకోగలడు. కాగా, ఓ టెస్టు ఫార్మాట్ చరిత్రలో ముగ్గురంటే ముగ్గురు వికెట్ కీపర్లు ఓ సిరీస్?లో 500o రన్స్ పరుగులు సాధించారు. డెనిస్ లిండ్సే (సౌతాఫ్రికా), ఆండీ ఫ్లవర్ (జింబాబ్వే), కుందరాన్ (భారత్) మాత్రమే ఈ ఘనత సాధించారు.

# ఇషాన్ కిషన్‌కు సన్‌రైజర్స్ గుడ్ బై?

ఐపీఎల్ 2025 సీజన్‌లో తీవ్రంగా నిరాశపర్చిన సన్‌రైజర్స్ హైదరాబాద్ అప్‌కమింగ్ సీజన్‌పై ఫోకస్ పెట్టింది. టైటిలే లక్ష్యంగా జట్టును తయారు చేస్తోంది. ఇప్పటికే కొత్త బౌలింగ్ కోచ్‌గా టీమిండియా మాజీ పేసర్ వరుణ్ ఆరోన్‌ను నియమించింది. జట్టు ప్రక్షాళనపై కూడా ఫోకస్ పెట్టింది. జట్టులో కొనసాగించే ఆటగాళ్లతో పాటు రిలీజ్ చేసే ఆటగాళ్ల జాబితాను రూపొందిస్తోంది. రిటెన్షన్ ప్రక్రియకు ముందే ట్రేడింగ్ విండో ద్వారా ఆటగాళ్లను మార్చుకునే వెసులు బాటు కూడా పరిశీలిస్తోంది. ట్రేడింగ్ విండో ద్వారా కోల్‌కతా నైట్‌రైడర్స్ స్టార్ బ్యాటర్ వెంకటేష్ అయ్యర్‌ను జట్టులోకి తెచ్చుకోవాలని సన్‌రైజర్స్ భావిస్తున్నట్లు జాతీయ మీడియాలో పలు కథనాలు వచ్చాయి. వెంకటేష్ అయ్యర్‌కు బదులు ఇషాన్ కిషన్‌ను ఇచ్చేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సిద్దమైనట్లు తెలుస్తోంది. మరోవైపు వెంకటేశ్ అయ్యర్‌ను వదులుకునేందుకు కేకేఆర్ ట్రేడింగ్ విండో ఓపెన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఐపీఎల్ 2025 మెగా వేలంలో వెంకటేశ్ అయ్యర్‌ను కేకేఆర్.. రూ. 23.75 కోట్ల భారీ దరకు కొనుగోలు చేసింది. కానీ అతను దారుణంగా విఫలమయ్యాడు. 20 పరుగుల సగటుతో 142 పరుగులు మాత్రమే చేశాడు. మరోవైపు ఇషాన్ కిషన్ 354 పరుగులు చేశాడు. ఇందులో ఓ సెంచరీ ఉంది. అయితే చాలా



మ్యాచ్‌ల్లో ఇషాన్ కిషన్ విఫలమయ్యాడు. అతని వైఫల్యం సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయవకాశాలను ప్రభావితం చేసింది. క్యాష్ డీల్ ద్వారా వెంకటేష్ అయ్యర్ తీసుకోవడానికి సన్‌రైజర్స్ ప్రయత్నం చేయవచ్చని కూడా ప్రచారం జరుగుతోంది. ట్రేడింగ్ ద్వారా సంజూ శాంసన్ తీసుకోవాలని సీఎస్‌కే ప్రయత్నిస్తున్నట్లు కూడా వార్తలు వచ్చాయి. రిషభ్ పంత్ కోసం ఢిల్లీ ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ కథనాలపై సంబంధిత ఫ్రాంచైజీలు ఇప్పటి వరకు ఎలాంటి కామెంట్ చేయలేదు. ఆటగాళ్లను ఒక జట్టు నుంచి మరో జట్టుకు పరస్పర అంగీకారంతో మార్చుకోవడాన్ని ట్రేడింగ్ అంటారు. ఐపీఎల్‌లో ట్రేడింగ్ రెండు దశల్లో జరుగుతుంది. తొలి దశ.. ఐపీఎల్ సీజన్ ముగిసిన ఏడు రోజుల తర్వాత ట్రేడింగ్ విండో ఓపెన్ అవుతుంది. తదుపరి సీజన్ కోసం వేలం నిర్వహించే వారం రోజుల ముందుకు వరకు ఇది కొనసాగుతోంది. ఈ సమయంలో ఫ్రాంచైజీలు.. ఆటగాళ్ల కోసం సంప్రదింపులు జరుపుకోవచ్చు. రెండో దశ.. ఐపీఎల్ వేలం ముగిసిన మరుసటి రోజు ఓపెన్ అవుతుంది. తదుపరి ఐపీఎల్ సీజన్ ప్రారంభానికి 30 రోజుల ముందు వరకు కొనసాగుతోంది. ఆల్-క్యాష్ డీల్స్ : ఒక జట్టు కావాల్సిన ఆటగాడి కోసం అతని పాత జట్టుకు డబ్బు చెల్లిస్తుంది. గతంలో హార్దిక్ పాండ్యా(గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబైకి), కామెరూన్ గ్రీన్(ముంబై ఇండియన్స్ నుంచి ఆర్‌సీబీ) వంటి ఆటగాళ్ల ట్రేడ్‌లు ఈ విధంగానే జరిగాయి. ప్లేయర్ స్వాప్స్: రెండు జట్లు ఆటగాళ్లను ఒకరికొకరు మార్చుకుంటాయి. దేవదత్ పడిక్కల్, ఆవేశ్ ఖాన్ ఇలానే ఒక జట్టు నుంచి మరొక జట్టుకు మారారు. ఆటగాడిని ట్రేడ్ చేసినప్పుడు సదరు ఆటగాడి ధరను టీమ్ సాలరీ పర్స్ నుంచి కట్ చేస్తారు. అదే సమయంలో విక్రయించే జట్టుకు ఆ మొత్తం జమవుతుంది. అవసరమైతే ఎక్కువ జీతం ఇవ్వడానికి కూడా ఫ్రాంచైజీలు సిద్దపడుతాయి. అయితే ఇందుకు బీసీసీఐ అనుమతి అవసరం. విదేశీ ఆటగాళ్లను ట్రేడ్ చేయాలంటే వారి దేశ క్రికెట్ బోర్డుల అనుమతి అవసరం.



# బుమ్రా ఆడినప్పుడే భారత్ ఎక్కువ మ్యాచ్?ల్లో ఓడిపోయింది!

### ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ డేవిడ్ లాయిడ్

ఇంగ్లాండ్ పర్యటనలో మూడు మ్యాచ్?ల తర్వాత ఆతిథ్య జట్టు 2–1తో లీడ్?లో కొనసాగుతోంది. ఇక భారత్– ఇంగ్లాండ్ మధ్య జూలై 23న నాలగో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్?కు ఓల్డ్ ట్రాఫోర్డ్ స్టేడియం వేదిక కానుంది. ఇందులో నెగ్గి సిరీస్?ను సమం చేయాలని భారత్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా జట్టు కూర్పుపై అందరి దృష్టి నెలకొంది.అయితే స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్ లోడ్ కారణంగా ఈ సిరీస్?లో మూడు మ్యాచ్?లే ఆడుతాడని మేనేజ్?మెంట్ ఇప్పటికే చెప్పింది. చెప్పినట్లే తొలి మ్యాచ్?లో ఆడిన బుమ్రా, రెండో టెస్టులో బెంచ్?కు పరిమితమయ్యాడు. ఇక లార్డ్స్ వేదికగా జరిగిన మూడో టెస్టులో మళ్లీ బరిలోకి దిగాడు. ఇక మిగిలిన రెండు మ్యాచ్?ల్లో బుమ్రా ఏదైనా ఒకే మ్యాచ్?లో ఆడే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం వెనుకంజలో ఉన్న టీమ్ఇండియా సిరీస్ నెగ్గాలంటే తదుపరి రెండు టెస్టుల్లోనూ విజయం సాధించాల్సిందే. ఈ లెక్కన బుమ్రా తదుపరి రెండింట్లో ఏ టెస్టులో ఆడాతాడని ఆసక్తి నెలకొంది.అయితే ఇలాంటి పరిస్థితుల్లో బుమ్రా విషయంలో టీమ్ఇండియా తమ ప్లాన్ మార్చుకోవాలని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ డేవిడ్ లాయిడ్ అన్నాడు. ఈ సిరీస్?లో బుమ్రా మూడు మ్యాచ్?లే ఆడతాడని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చెప్పిన విషయాన్ని గుర్తు చేశాడు. అయితే ఈ సిరీస్?లో ఇప్పటివరకు బుమ్రా ఆడిన రెండు మ్యాచ్?ల్లోనూ భారత్ ఓడిందని, ఎడ్జ్?బాస్టన్?లో విజయం సాధించిన? టెస్టులో అతడు ఆడలేదని పేర్కొన్నాడు."బుమ్రా ఐదింట్లో మూడు టెస్టులే ఆడతాడని గంభీర్ చెప్పాడు. అంటే వాళ్లకు అతడి విషయంలో ఓ ఛాయిస్ ఉంది. బుమ్రా ఇప్పటికే రెండు మ్యాచ్?లు ఆడాడు. ఇంకా ఈ సిరీస్?లో రెండు టెస్టులు ఆడాల్సి ఉంది. గంభీర్ చెప్పినట్లు బుమ్రా నాలుగో మ్యాచ్?లో ఆడి, ఒకవేళ ఇందులో టీమ్ఇండియా నెగ్గితే సిరీస్ 2–2తో సమం అవుతుంది. అప్పుడు బుమ్రాను ఐదో టెస్టులోనూ ఆడించాలనుకుంటారు""కానీ భారత్ ఓడిపోతే సిరీస్ 3–1గా మారుతుంది. అప్పుడు ఆఖరి మ్యాచ్?లో బుమ్రా ఆడడు. అయితే ఇక్కడ గమనించాల్సింది ఏమిటంటే? బుమ్రా ఆడనప్పటి కంటే అతడు ఆడినప్పుడే టీమ్ఇండియా ఎక్కుగా ఓడిపోతుంది. అయినా అతడు ప్రపంచంలో అత్యుత్తమ బౌలర్. కానీ, అతడి బౌలింగ్ యాక్షన్ ఇబ్బందిగా ఉంటుంది" అని లాయిడ్ అన్నాడు.కాగా, ఈ సిరీస్?లో బుమ్రా రెండు మ్యాచ్?ల్లో 12 వికెట్లు పడగొట్టాడు. ఇందులో రెండుసార్లు 5 వికెట్ల ప్రదర్శన చేశాడు. అయిచతే దరదృష్టవశాత్తు టీమ్ఇండియా ఈ టెస్టుల్లోనూ ఓటమిపాలైంది. దీంతో బుమ్రా తదుపరి రెండింట్లో ఏ మ్యాచ్?లో ఆడతాడని ఆసక్తి నెలకొంది.ఇక 2018లో బుమ్రా టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. ఇప్పటిదాకా 47 టెస్టుల్లో టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించాడు. అయితే అందులో భారత్ 20 మ్యాచ్?ల్లోనే నెగ్గింది. 23 టెస్టుల్లో ఓడింది. ఇక బుమ్రా డెబ్యూ తర్వాత అతడు లేకుండా టీమ్ఇండియా 27 మ్యాచ్?లు అడితే అందులో 19 నెగ్గింది.

# మాంచెస్టర్ టెస్ట్ నుంచి పంత్‌ను తప్పించండి

### మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు

భారత్ %–% ఇంగ్లండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భాగంగా మాంచెస్టర్ వేదికగా జరగనున్న నాలుగో టెస్ట్ మ్యాచ్‌కు ముందు భారత వికెట్ కీపర్–బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ గాయంపై మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి కీలక వ్యాఖ్యలు చేశారు. పంత్ లార్డ్స్ టెస్ట్ సందర్భంగా వికెట్ కీపింగ్ చేస్తున్నప్పుడు వేలికి గాయమైంది. ఈ గాయంతోనే అతను రెండు ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్ చేసినప్పటికీ, కీపింగ్ బాధ్యతలను ధ్రువ్ జురెల్ నిర్వర్తించాడు.ఈ నేపథ్యంలో, మాంచెస్టర్ టెస్ట్‌లో పంత్‌ను ప్రత్యేక బ్యాట్స్‌మెన్‌గా ఆడించాలా వద్దా అనే విషయంపై చర్చ జరుగుతోంది. ఈ విషయంపై రవిశాస్త్రి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "పంత్ కీపింగ్ చేయలేకపోతే, అతను ప్రత్యేక బ్యాట్స్‌మెన్‌గా ఆడకూడదు. ఎందుకంటే అతను ఫీల్డింగ్ చేయాల్సి వస్తుంది. ఒకవేళ అతను ఫీల్డింగ్ చేస్తే, అది గాయాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది" అని శాస్త్రి ఐసీసీ రివ్యూలో పేర్కొన్నారు. "కీపింగ్ గ్లవ్స్‌తో కొంత రక్షణ ఉంటుంది. కానీ గ్లవ్స్ లేకుండా, గాయమైన వేలికి బంతి తగిలితే అది మరింత హానికరం అవుతుంది. అది గాయాన్ని మరింత తీవ్రతరం చేస్తుంది" అని అన్నారు. గాయం తీవ్రతను అంచనా వేయడం ముఖ్యం అని శాస్త్రి నొక్కి చెప్పారు. "అది పగులు లేదా ఫ్రాక్చర్ అయితే, అతను విశ్రాంతి తీసుకుని ఓవల్ టెస్ట్ నాటికి పూర్తి ఫిట్‌నెస్‌తో తిరిగి రావాలి. అతనికి ఇప్పుడు సబ్‌స్టిట్యూట్ లభించదు. అతను గాయపడ్డాడని వారికి తెలుస్తుంది. తదుపరి టెస్ట్‌కు జట్టును ఎంపిక చేసినప్పుడు, అతను కీపింగ్, బ్యాటింగ్ రెండూ చేయాలి. రెండింటిలో ఒకటి మాత్రమే చేయలేడు. అతను పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంటేనే ఆడాలి. ఒకవేళ పగులు కాకపోతే, అతను ఆడతాడని అనుకుంటున్నాను" అని శాస్త్రి తెలిపారు.పంత్ ప్రస్తుత సిరీస్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఆరు ఇన్నింగ్స్‌లలో 70.83 సగటుతో 425 పరుగులు చేశాడు. జట్టుకు అతను ఒక కీలక ఆటగాడు. భారత సహాయ కోచ్ ర్యాన్ టెన్ డోస్కేట్ కూడా పంత్‌కు పూర్తి కోలుకోవడానికి వీలైనంత ఎక్కువ సమయం ఇస్తున్నామని, మాంచెస్టర్ టెస్ట్‌కు ముందు అతను బ్యాటింగ్ చేస్తాడని తెలిపారు. అయితే, కీపింగ్ అనేది కోలుకునే ప్రక్రియలో చివరి భాగమని, మళ్ళీ కీపర్‌ను మధ్యలో మార్చాల్సి రావడం ఇష్టం లేదని కూడా డోస్కేట్ పేర్కొన్నారు.భారత జట్టు మేనేజ్‌మెంట్, కెప్టెన్ శుభమాన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్, పంత్ గాయంపై పూర్తి అంచనా వేసి, జట్టు ప్రయోజనాల దృష్ట్యా సరైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సిరీస్‌లో 1–2తో వెనుకబడిన భారత్‌కు ఈ కీలక టెస్ట్‌లో పంత్ లాంటి ఆటగాడి సేవలు చాలా అవసరం. అయితే, అతని ఆరోగ్యం, దీర్ఘకాలిక ఫిట్‌నెస్ కూడా అంతే ముఖ్యం.

# సిరాజ్‌పై అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ప్రశంసల జల్లు

టీమిండియా స్టార్ పేసర్, హైదరాబాద్ డీఎస్పీ మహమ్మద్ సిరాజ్‌పై అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కాటే ప్రశంసల జల్లు కురిపించాడు. సిరాజ్.. టీమిండియా బౌలింగ్ సింహం అని కొనియాడాడు. అతని అంకిత భావం, పోరాట స్ఫూర్తి అద్భుతమన్నాడు. సిరాజ్ వంటి ఆటగాడు జట్టులో ఉండటం టీమిండియా అదృష్టమని తెలిపాడు. ఎన్ని ఓవర్లు వేసినా అలిసిపోడని, జట్టు కోసం అదనపు బాధ్యత తీసుకునేందుకు ఎప్పుడూ ముందుంటాడని చెప్పుకొచ్చాడు. ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో సిరాజ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. వరుసగా మూడు మ్యాచ్‌లు ఆడిన సిరాజ్ 32 సగటుతో 13 వికెట్లు తీసాడు. జస్ప్రీత్ బుమ్రా గైర్హాజరీలో ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో (6/70) ఆరు వికెట్లతో భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. లార్డ్స్ టెస్ట్‌లో బ్యాట్‌తోనూ జడేజాతో కలిసి టీమిండియా విజయం కోసం పోరాడాడు. కానీ దురదృష్టవశాత్తు ఆఖరి వికెట్‌గా వెనుదిరగడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. నాలుగో టెస్ట్ బుధవారం నుంచి మాంచెస్టర్ వేదికగా జరగనుంది.ఈ మ్యాచ్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన ర్యాన్ టెన్ డస్కాటే.. సిరాజ్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుతూ ప్రశంసల జల్లు కురిపించాడు. ' మహమ్మద్ సిరాజ్ వంటి ఆటగాడు జట్టులో ఉండటం టీమిండియా అదృష్టం. ఒక ఫాస్ట్ బౌలర్‌గా అతని నుంచి మనం ఆశించే ఫలితం ఎప్పుడూ రాకపోవచ్చు. కానీ మనస్ఫూర్తిగా చెబతున్నా అతను ఓ సింహం. అతను బంతిని అందుకున్న ప్రతీసారి ఏదో జరగబోతుందని అనిపిస్తుంది. అతను ఎప్పుడూ వర్క్‌లోడ్‌ను తగ్గించుకునేందుకు ప్రయత్నించడు. అయితే అతని పనిభారాన్ని జాగ్రత్తగా సమన్వయం చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. అతను అత్యుత్తమ ప్రదర్శన చేయడానికి కావాల్సిన ఫిట్‌నెస్‌తో ఉన్నాడా? అనేది మేం నిర్ధారించుకోవాలి. కొన్నిసార్లు అతను ఆడటానికి సిద్దంగా ఉన్నా.. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా రెస్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.'అని ర్యాన్ టెన్ డస్కాటే చెప్పుకొచ్చాడు.మాంచెస్టర్ వేదికగా జరిగే నాలుగో టెస్ట్‌తో చివరి మ్యాచ్‌కు సంబంధించిన బౌలింగ్ కాంబినేషన్‌పై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ర్యాన్ టెన్ తెలిపాడు. 'మ్యాచ్ టైమ్ వరకు బౌలింగ్ కాంబినేషన్‌పై తుది నిర్ణయం తీసుకుంటాం. ముఖ్యంగా అర్ష్‌దీప్ సింగ్‌ను ఆడించే విషయాన్ని పరిశీలుస్తున్నాం. అతను మా ప్రణాళికలో ఉన్నాడు. కానీ పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

# అక్రమ సంబంధంతో భర్తను కడతేర్చిన భార్య

### ఢిల్లీలో వెలుగుచూసిన మరో ఘటన

**న్యూఢిల్లీ,**

ఇష్టంలేని పెళ్లిళ్లు, అక్రమ సంబంధాలు, అత్తింటిలో వేధింపులు వంటి కారణాలతో భార్యలు భర్తలను అడ్డు తొలిగించుకుంటున్న ఘటనలు వరుసగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా దిల్లీలో ఇలాంటి హత్యే ఒకటి జరిగింది. మృతుడి కజిన్‌తో కలిసి నిందితురాలు ఈ దారుణానికి ఒడిగట్టింది. దిల్లీకి చెందిన సుస్మిత జులై 13న తన భర్త కరణ్‌దేవ్(36)కు కరెంట్ షాక్ తగిలిందని ఆసుపత్రికి తీసుకొచ్చింది. అతడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు– ధ్రువీకరించారు. ఆమె చెప్పినట్టు–గా దీన్ని ఓ ప్రమాదమని నమ్మిన కరణ్ కుటు–ంబసభ్యులు పోస్ట్‌మార్టం అవసరం లేదని చెప్పారు. కానీ, ఈ కేసులో సుస్మిత, మృతుడి బంధువు రాహుల్ తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు మృతదేహాన్ని శవపరీక్షకు తరలించారు. అటు– కరణ్ సోదరుడికి కూడా అనుమానం వచ్చి సుస్మిత ఇన్‌స్టా చాటింగ్‌ను పరిశీలించాడు. అందులో ఆమె రాహుల్‌తో మర్డర్ ఎ÷–లాన్ గురించి చర్చించినట్లు– గుర్తించిన అతడు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. దీంతో సుస్మిత, రాహుల్ మధ్య సంబంధం బయటపడటంతో పాటు– కరణ్‌ది సహజమరణం కాదని, హత్య అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. కరణ్ అడ్డు తొలగించుకునేందుకు తొలుత నిందితులు భోజనంలో నిద్ర మాత్రలు ఇచ్చారు. తర్వాత అతడు స్పృహ కోల్పోయే వరకు ఎదురుచూశారు. మోతాదుకు మించి నిద్ర మాత్రలు వేసుకుంటే.. ఎంతసేపటిలో మరణం సంభవిస్తుందో కూడా వారు నెట్‌లో వెతికారు. ఆ మాత్రలు తీసుకున్నా కరణ్ ఊపిరి ఆగకపోవడంతో.. ప్రమాదంగా చిత్రీకరించేందుకు కరెంట్ షాక్ ఇచ్చారు. చాటింగ్ ద్వారా వెల్లడైన ఈ వివరాల ఆధారంగా పోలీసులు నిందితులను కస్టడీలోకి తీసుకున్నారు. దర్యాప్తులో ఆమె నేరాన్ని అంగీకరించినట్లు– పోలీసులు తెలిపారు. కరణ్ తనను డబ్బు కోసం వేధించేవాడని, దాంతో తాను తీవ్ర మనోవేదనకు గురయ్యానని ఆమె వెల్లడించింది. ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# టిటిడిలో అన్యమతస్థుల తొలగింపు

### నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన టిటిడి

**తిరుపతి,**

నలుగురు అన్యమత ఉద్యోగులని తిరుమల తిరుపతి దేవస్థానం సస్పెండ్ చేసింది. ఈ మేరకు శనివారం టీటీడీ ప్రకటన విడుదల చేసింది. టీటీడీలో పనిచేస్తున్న బి.ఎలిజర్, డిప్యూటీ– ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (క్వాలిటీ– కంట్రోల్), ఎస్. రోసి, స్టాప్‌నర్స్(బర్డ్ ఆస్పత్రి), ఎం.ప్రేమావతి, గ్రేడ్ –1 ఫార్మసిస్ట్ (బర్డ్ ఆస్పత్రి), అదేవిధంగా డా.జి.అసుంత. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీల్లో విధులు నిర్వహిస్తున్న ఈ నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. సదరు నలుగురు ఉద్యోగులు క్రిస్టియన్ మతాన్ని అనుసరిస్తున్నారని.. అందుకు సంబంధించిన ఆధారాలు, వీరిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేశామని అధికారులు తెలిపారు. వీరు టీటీడీ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని అన్నారు. హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ బాధ్యతారహితంగా వ్యవహరించారని చెప్పారు. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు సదరు నలుగురు ఉద్యోగులను తక్షణమే సస్పెండ్ చేశామని టీటీడీ అధికారులు పేర్కొన్నారు.

# మద్యం కేసులో సిట్ విచారణకు మిథున్ రెడ్డి

### తనను అరెస్ట్ చేసి ఆనదించాలన్నదే వారి అభిమతం

### ఈ కేసుల న్యాయస్థానంలో నిలువదని వ్యాఖ్య

**విజయవాడ,**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో భాగంగా వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి విజయవాడలో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఢిల్లీ నుంచి విజయవాడ చేరుకున్న ఆయన శనివారం నేరుగా సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన ఈ కేసులో ఏ4గా ఉన్నారు. ఇప్పటికే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. శుక్రవారం సుప్రీంకోర్టు కూడా ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. మిథున్‌రెడ్డి రాక నేపథ్యంలో సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు– చేశారు. వాహనాల రాకపోకలను పోలీసులు నియంత్రించారు. మిథున్‌రెడ్డి ఏ క్షణమైనా అరెస్టయ్యే అవకాశం కనిపిస్తోంది. హైకోర్టు, సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేయడంతో ఆయనపై అరెస్టు వారంట్ జారీ కోసం సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో వేశారు. అయితే హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు సంబంధించి పూర్తి వివరాల్ని దానికి అనుబంధంగా సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి ఆ మెమో రిటర్న్ చేయటంతో.. వాటిని ఆగమేఘాలపై సమర్పించారు. ఇదిలావుంటే లిక్కర్ కేసులో తనను అనవసరంగా ఇరికించారని, ఇది చెల్లదని మిథున్ రెడ్డి అన్నారు. కావాలనే వారు తనను అప్రతిష్ట చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ కేసులో న్యాయపరంగా పోరాడుతానని అన్నారు. తనను అరెస్ట్ చేసి ఆనందం పొందాలని చూస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు.

# ఏపీలో కక్షపూరిత రాజకీయాలు

### మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు

### రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నమోదు

### వైసిపి ఎంపి మిథున్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ,**

ఏపీలో మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు.. రాజకీయ ఒత్తిడితోనే తనపై కేసు పెట్టారని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. మద్యం కేసులో తన పాత్రపై ఆధారాలు ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీలో ముఖ్యమైన నాయకులను జైల్లో పెట్టడమే టార్గెట్‌గా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో సిట్ విచారణకు తాను హాజరు అవుతున్నట్టు మిథున్ రెడ్డి చెప్పారు. ఈ క్రమంలోనే మిథున్ రెడ్డి ఢిల్లీ నుంచి విజయవాడకు బయలు దేరేముందు మీడియాతో మాట్లాడారు. ఏపీలో కక్షపూరిత రాజకీయాలు జరుగుతున్నాయని, మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు. ఈ కేసులో ఎలాంటి సీజర్లు లేవు, సాక్ష్యాలు లేవని అందుకే కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. భయపడే వ్యక్తిని అయితే రాజకీయాల్లోనే ఉండను. వీటన్నిటిని ధైర్యంగా ఎదుర్కొంటాను. ఈ కేసుల నుంచి బయటపడతాను. నా పాత్రపై ఆధారాలు ఉంటే చూపించండి. నా ఫోన్లు మీకు ఇస్తా.. దర్యాప్తునకు సహకరిస్తాను. సిట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. రాజకీయ ఒత్తిడితోనే నాపై కేసు పెట్టారు. ముందుగానే ఒక వ్యక్తిని జైల్లో వేయాలని నిర్ణయించుకుని.. ఆ తర్వాత దాని చుట్టూ కథ అల్లుతున్నారని మండుపడ్డారు. తమకు అనుకూలంగా ఉన్న వారిని నయానో.. భయానో ఒప్పించి స్టేట్‌మెంట్లు తీసుకుంటున్నారు. నోటి మాటలతో ప్రకటనలు ఇప్పించి కేసు నడుపుతున్నారు. ముఖ్యమైన నాయకులను జైల్లో పెట్టడమే టార్గెట్ గా కేసులు పెడుతున్నారు. మద్యం కేసు వారి టార్గెట్ కాదు. తమకు నచ్చని వారిని వేధించేందుకు రకరకాల కథలు అల్లుతున్నారు.. ఇదేమి కొత్తది కాదు. 2014–19 లోను నాపై తప్పుడు కేసులు పెట్టారు. నేనేదో దాడి చేశానని నాడు టీడీపీ హయాంలో కేసు పెట్టారు. నేను తప్పు చేయలేదని ఎంత చెప్పినా వినకుండా జైల్లో పెట్టారు. అప్పుడు తప్పుడు సాక్షాలు చెప్పిన వారంతా.. మళ్లీ కోర్టుకు వచ్చి అదంతా తప్పు అని చెప్పారు. దాంతో కోర్టు ఆ కేసును కొట్టివేసింది. మళ్లీ అదే తరహాలో ఇప్పుడు అరెస్టు చేస్తున్నారు. వీటన్నిటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఎవరినైనా అరెస్టు చేయాలనుకుంటే ముందుగా ఎల్లో మీడియాలో.. మాస్టర్ మైండ్ అని కట్టుకథలు అల్లుతున్నారు. గతంలో ఇతరులను మాస్టర్ మైండ్ అన్నారు.. ఇప్పుడు నన్ను మాస్టర్ మైండ్ అంటున్నారు.. రేపు ఇంకొకరిని పట్టుకొచ్చి అతన్ని మాస్టర్ మైండ్ అంటారు. ఏదోరకంగా మాపై బురద జల్లాలని చూస్తున్నారు. కొద్దిమంది అధికారులను తీసుకొచ్చి భయపెట్టి.. ఒప్పుకోకపోతే జైల్లో పెడతామని ప్రకటనలు తీసుకుంటున్నారు. మేము ఎక్కడ కలిశామో ఆధారాలు చూపండి. నోటి మాటతో కేసు పెడతారా?రేపు రాబోయే రోజుల్లో ఇదే అధికారులను బెదిరించి చెప్పించారని కోర్టులో చెబుతారు.. కేసు కొట్టివేస్తారు. గతంలో కూడా ఇలాగే నాపై తప్పుడు కేసు పెడితే కోర్టు కొట్టేసింది. ఈ కేసులో రేపు జరగబోయేది కూడా ఇదేనన్నారు. మద్యం కేసులో మొదట్లో 50వేల కోట్లు అన్నారు. ఆ తర్వాత 30,000 కోట్లు–.. అటు– తర్వాత 3000 కోట్లు– అని అంటున్నారు. 3000 కోట్లు ఎక్కడ అంటే.. ఎలక్షన్‌లో ఖర్చు పెట్టారని చెబుతున్నారు. సిట్ చెప్పే కట్టు కథలు నమ్మదగినవి కాదు. ఎక్కడైనా డబ్బును సీజ్ చేశారా?. పెట్టు–బడులు పెట్టారా?. ఇవన్నీ లేకుండా కేవలం నోటి మాటతో కథలు చెబుతున్నారు. అరెస్టు చేసి ఇబ్బంది పెట్టాలని లక్ష్యంతోనే ఈ కేసులు పెట్టారు.. ఈ కేసు ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ఒక ఎంపీగా నా పాత్ర పార్లమెంటు–నియోజకవర్గం వరకే పరిమితం. మద్యం విధానాల్లో నేను జోక్యం చేసుకోలేదు. పార్లమెంటు–లో చట్టాల రూపకల్పనలో చర్చల్లో పాల్గొనడమే మా పని. మరెక్కడ కూడా నేను జోక్యం చేసుకోలేదు. కేవలం కక్ష సాధింపులో భాగంగానే కేసులు బనాయించారు. ఈ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాను. ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అన్నింటికీ మేము రెడీగా ఉన్నాం. తప్పు చేయనంతవరకు భయపడాల్సిన పనిలేదని మిథున్ రెడ్డి అన్నారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దుమారం

### పైలట్ ఆత్మహత్యే కారణమంటూ


### అమెరికన్ మీడియా కథనాలు

### మండిపడుతూ లీగల్ నోటీసులు

### పంపిన పైలట సంఘాలు

**న్యూఢిల్లీ,**

అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి పైలట్‌నే కారణమంటూ అంతర్జాతీయ మీడియా ఊదరగొట్టింది. పైలట్ ఆత్మహత్య చేసుకోవడం వల్లే ఎయిరిండియా బోయింగ్ విమానం కూలిపోయిందంటూ వార్తలు వండి వార్చాయి. అయితే ఈ కథనాలను మొట్టమొదటి నుంచి పైలట్ సంఘాలు ఖండిస్తూనే ఉన్నాయి. తుది రిపోర్ట్ రాక ముందే ఎలా తప్పుడు కథనాలు ప్రసారం చేస్తారంటూ యూనియన్లు మండిపడ్డాయి. తాజాగా ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌లకు పైలట్ సంఘాలు లీగల్ నోటీసులు పంపించాయి. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. పాశ్చాత్య మీడియాతో ప్రాథమిక నివేదికను తప్పుగా అర్థం చేసుకుందని పైలట్ సంఘాలు ధ్వజమెత్తాయి. ఇదిలా ఉంటే మీడియా కథనాలను అమెరికా దర్యాప్తు సంస్థ ఎన్‌టీఎస్‌బీ కూడా తీవ్రంగా ఖండించింది. ఊహాజనిత కథనాలు ప్రసారం చేస్తున్నారంటూ కొట్టిపారేసింది. ఈ నేపథ్యంలో పైలట్ సంఘాలు మండిపడుతున్నాయి. అంతర్జాతీయ మీడియా క్షమాపణ చెప్పాలని యూనియన్లు కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పైలట్స్ ది వాల్ స్ట్రీట్ జర్నల్, రాయిటర్స్‌లకు లీగల్ నోటీసు జారీ చేసింది. కాక్‌పిట్ వాయిస్ రికార్డింగ్‌లో.. పైలట్‌ల్లో ఒకరు మరొకరిని ఎందుకు కట్–ఆఫ్ చేశావని అడుగుతున్నట్లు వినబడింది. మరొక పైలట్ తాను అలా చేయలేదని ప్రతిస్పందించాడు అని ప్రాథిమక నివేదిక తెలిపింది. అయితే విమానంలో 11ఆ దగ్గర కూర్చున్న ప్రయాణీకుడు విశ్వాష్‌కుమార్ రమేష్ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడు దర్యాప్తు అధికారులతో మాట్లాడుతూ.. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే పెద్ద శబ్దం రావడంతో ఆగిపోయిందని చెప్పాడు. ఆకుపచ్చ, తెలుపు లైట్లు–మిణుకుమిణుకుమంటున్నాయని పేర్కొన్నాడు. క్రాష్ కాకుండా చూసేందుకు పైలట్లు– తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు–గా రమేష్ తెలిపాడు. కానీ అంతలోనే కూలిపోయిందని చెప్పాడు. ఇక విమానం కూలిపోక ముందు కేవలం 625 అడుగుల ఎత్తులోనే ఉంది. అదే 3,600–4,900 అడుగుల ఎత్తులో ఉంటే మాత్రం విమానం ప్రమాదానికి గురి కాకుండా నియంత్రించొచ్చు. అందువల్లే పైలట్లకు సాధ్యం కాలేదు. జూన్ 12న అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిరిండియా విమానం లండన్‌కు బయల్దేరింది. టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే విమానం సమీపంలోని హాస్టల్‌పై కూలిపోయింది. ఒక్కరు మినహా 241 మంది చనిపోయారు.హాస్టల్‌లో మెడికోలు కూడా చనిపోయారు. ఇలా మొత్తం 271 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల కుటుంబాలకు ఎయిరిండియా రూ.కోటి పరిహారం అందించింది.



అక్షరకలం
తెలుగు దినపత్రిక





# యువత మెచ్చే అంశాలతో..

నరేన్, ప్రీతిసుందర్ జంటగా నటించిన చిత్రం 'ఆ గ్యాంగ్ రేపు-3'. వైరల్ షార్ట్‌ఫిల్మ్స్ సిరీస్ 'ఆ గ్యాంగ్ రేపు' టీమ్ రూపొందించిన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఇది ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. యోగీ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి నోక్షియస్ నాగ్స్ నిర్మాత. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశామని, నేడు సమాజంలో జరుగుతున్న సంఘటనలను చూపించామని దర్శకుడు యోగీ కుమార్ తెలిపారు. యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యే కాన్సెప్ట్ ఇదని, తప్పకుండా ప్రేక్షకాదరణ పొందుతుందనే నమ్మకం ఉందని నిర్మాత పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: కబీర్ రఫీ, దర్శకత్వం: యోగీ కుమార్.

# సింగర్ సునిధి.. ఫిట్‌నెస్ అదిరింది



తన అద్భుతమైన గళంతో మనల్ని మంత్రముగ్ధులను చేసే సునిధి చౌహాన్.. ఇప్పుడు తన ఫిట్‌నెస్‌తో ఫిదా చేస్తున్నది. ఈతరం అమ్మాయిలకు ఫిట్‌నెస్‌పై ఆసక్తి కలిగించేలా తన ఇన్‌స్టాగ్రామ్‌ని మార్చేసింది. సునిధి ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ గురించి ఆమె ఫాలోవర్స్‌కు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. అయితే, ఈ సింగర్ తాజాగా పోస్ట్ చేసిన ఒక ఫొటో అందరినీ ఆశ్చర్యంలో పడేసింది. ఇందులో బ్లాక్ కలర్ బ్రాలెట్, లూజ్ డెనిమి ప్యాంట్, ఫ్లిప్-ఫ్లాప్స్‌తో కనిపించింది సునిధి. నడుము చుట్టూ బ్లూలైన్స్ వైట్ జాకెట్ కట్టేసుకుంది. వీటికన్నా ఆమె ఫాలోవర్స్‌ను ఆకర్షించింది మాత్రం సునిధి టన్డ్ ఫిజికే! ఆమె వాష్‌బోర్డ్ అబ్స్ ఇందులో స్పష్టంగా కనిపించాయి. ఈ లుక్ చూస్తుంటే.. 40 ఏండ్లు దాటిన సునిధి ఎంత ఫిట్‌గా ఉందో అర్థమైంది. ఫిట్‌నెస్ అంటే అబ్బాయిలకే కాదు.. అమ్మాయిలకు కూడా అని చాటి చెప్పింది. అతివలు కూడా ఎంత టక్‌స్టైలిష్‌గా, ఫిట్‌గా ఉండొచ్చో తన లుక్‌తో ప్రూవ్ చేసింది. వ్యాయామం, సరైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి ఉంటే.. ఏ వయసులోనైనా ఫిట్‌గా ఉండొచ్చు అని చెప్పకనే చెబుతున్నది సునిధి.




# అందరూ సర్‌ప్రైజ్ అవుతారు!

'యానిమల్' సినిమాతో దేశవ్యాప్తంగా యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది త్రిప్తి దిమ్రి. . ప్రభాస్-సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' చిత్రం నుంచి దీపికా పదుకోన్ తప్పుకోవడంతో ఆమె స్థానంలో త్రిప్తి దిమ్రిని నాయికగా ఎంపిక చేశారు. తాజా ఇంటర్వ్యూలో ఈ భామ తాను నటిస్తున్న సినిమాల విశేషాలను వెల్లడించింది "స్పిరిట్' సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. బలమైన భావోద్వేగాలు కలబోసిన కథ ఇది. ఈ సినిమాలోని ఎలిమెంట్స్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తాయి. నా కెరీర్‌లో మరో ఉత్తమ చిత్రంగా మిగిలిపోతుందనే నమ్మకం ఉంది. విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. అదొక అద్భుతమైన కథ. కెరీర్ ఆరంభంలోనే ప్రతిభావంతులైన దర్శకులతో పనిచేయడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నా' అని చెప్పింది.

# ఒకప్పుడు వాచ్‌మెన్‌గా రూ.165 జీతం ..ఇప్పుడు కోట్లు సంపాదిస్తున్నాడు..!

టాలీవుడ్‌లో తనదైన నటనతో తెలుగు ప్రేక్షకులకి దగ్గరైన నటుడు షాయాజీ షిండే. హిందీ, తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళం, గుజరాతీ, మరాఠీ భాషల్లో చాలా చిత్రాలు చేసి అశేష ప్రేక్షకాదరణ సంపాదించుకున్నాడు. ఎంతో కష్టంతో ఆయన ఉన్నత స్థితికి చేరుకున్నాడు. మహారాష్ట్రలోని శంకర్‌వాడి అనే పల్లెటూళ్లో సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన షాయాజీ 1995 నుండి నటించడం మొదలు పెట్టారు. మహారాష్ట్రలోని ఒక చిన్న గ్రామంలో జన్మించాడు షిండే. ఆయన తండ్రి ఓ సాధారణ రైతు. అయితే కొన్నాళ్లకి షాయాజీ సొంతూరు విడిచిపెట్టి సతారా నగరానికి వెళ్లిపోయాడు. అక్కడే చదువుకున్నాడు.అయితే షాయాజీ షిండేకి సినిమా అంటే పిచ్చి. అతని జీవితంలో సినిమా కష్టాలు ఉన్నాయి. నటుడిగా ప్రయత్నం చేయకముందు కొన్నాళ్లపాటు మహారాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేశారు. అప్పుడు షాయాజీ నెల జీతం రూ.165 కాగా, అందులో రూ.150 ఇంట్లో ఇచ్చి, మిగిలిన పదిహేను రూపాయలు తన ఖర్చులకి ఉంచుకునేవారట. ఆ టైంలో ఆయనకున్న డ్రీమ్ ఏంటంటే రూ.400 లు జీతం అందుకోవాలని.నీల్ కులకర్ణి అనే వ్యక్తి సహాయంతో నాటకాల్లో పనిచేయడం మొదలు పెట్టాడు. ముంబైకు వెళ్లి యాక్టింగ్ లోనూ శిక్షణ తీసుకున్నాడు.





# మరో 30 రోజుల్లో 'వార్ 2'.. కొత్త పోస్టర్ పంచుకున్న ఎన్టీఆర్

బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్, టాలీవుడ్ సంచలనం ఎన్టీఆర్ కలిసి నటిస్తున్న భారీ స్పై థ్రిల్లర్ చిత్రం 'వార్ 2' కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 2019లో హృతిక్ నటించిన బ్లాక్‌బస్టర్ స్పై థ్రిల్లర్ 'వార్'కి ఇది సీక్వెల్‌గా వస్తోంది.ఈ సినిమాలో హృతిక్ మరోసారి రా ఏజెంట్ మేజర్ కబీర్ ధాలివాల్ పాత్రలో కనిపించనుండగా, ఎన్టీఆర్ ఈ ఫ్రాంచైజీలో ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఆగష్టు 14న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా ప్రమోషన్స్ షురూ చేసింది చిత్రయూనిట్. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా 30 రోజులే ఉందని తెలుపుతూ.. కౌంట్‌డౌన్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. తాజాగా ఈ పోస్టర్‌ను ఎక్స్ వేదికగా పంచుకున్నాడు నటుడు ఎన్టీఆర్. ఈ సినిమాకు అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యష్‌రాజ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నాడు. కియారా అద్వానీ కథానాయికగా నటిస్తుంది.



# అభినయాల తారకి..
# అక్షర నీరాజనం..

చారడేసి కళ్లు.. వంకీల జుట్టు.. అన్నింటికి మించిన అభినయం.. ఆమెను గొప్పనటిని చేశాయి. వెండితెరపై వెలుగొందిన తార.. కృష్ణుడు అంటే ఎన్టీఆర్ ఎలాగో, సత్యభామ అంటే జమునే మన మదిలో మెదులుతారు. మిస్సమ్మ చిత్రంలో అమాయకత్వం.. పండంటికాపురంలో రాణీ మాలినీదేవి.. మూగమనసులలో గౌరమ్మ.. గుండమ్మ కథలో పెంకిపిల్ల.. ఇలా అనేక పాత్రలు ఆమె అద్భుత అభినయానికి అద్దంపడతాయి. నాటితరం తెలుగు ప్రేక్షకుల్లో ఆమె అభిమానులు అనేకమంది.. ఆమె స్టైయిల్‌ను ఫాలో అయిన నాటి మహిళలు ఎందరో.. తెలుగు చిత్ర పరిశ్రమలో కథానాయకులుగా రాణించినవాళ్లు ఎంతోమంది ఉన్నారు. అందులో కొందరు మాత్రమే తమదైన కళా ప్రతిభను ప్రదర్శించి, తమకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. అలాంటి నటీమణుల్లో మణిపూస జమున. ఆమె మాతృభాష తెలుగు కాకపోయినా, తెలుగింటి అమ్మాయిగా ప్రేక్షకుల మదిలో స్థిరస్థాయిగా నిలిచిపోయారు.తండ్రి వ్యాపారరీత్యా మకాం దుగ్గిరాలకు మార్చారు. అక్కడే జమున హైస్కూలు విద్యాభ్యాసం మొదలైంది. చదువులోనే కాదు.. ఆటపాటల్లోనూ జమున ఫస్టే. అంతరజిల్లా పాటల పోటీల్లో జమునకు ప్రథమ బహుమతి వచ్చింది. అప్పటి





నుంచీ నటన, గానం, సంగీతంపై ఆమె మక్కువ ఏర్పడింది. 'ఛలో ఢిల్లీ' నాటకంలో వసుంధర పాత్ర పోషించారు. అప్పట్లో కమ్యూనిస్టుల ప్రాభవం.. ప్రజానాట్యమండలిగా వర్ధిల్లుతున్న దశ. ఆ సమయంలో గరికపాటి రాజారావుగారు జమునతో 'మా భూమి' నాటకంలో కమల చెల్లెలుగా కీలకపాత్ర వేయించారు. ఆమె నటనను చూసి, సినీ పరిశ్రమకూ రాజారావుగారే పరిచయం చేశారు. బుర్రకథ పితామహుడు నాజర్ ఆధ్వర్యంలో జమున శిక్షణ తీసుకొన్నారు. సంగీతం అంటే జమునకు మక్కువ. చిన్నప్పుడే హార్మోనియం, వీణ నేర్చుకొన్నారు.

**సినీ అరంగేట్రం..**

దుగ్గిరాలకు చెందిన శ్రీమన్నారాయణకు చిత్రసీమతో అనుబంధం ఉంది. ఆయన కొన్ని చిత్రాల్లో నటించారు. ఆయన సిఫార్సు మేర 'జై వీర భేతాళ' అనే జానపద చిత్రంలో కథానాయికగా జమునకు అవకాశం వచ్చింది. అందులో గుమ్మడి కథానాయకుడు. స్కూలు ఫైనల్ పరీక్షల్ని సైతం పక్కన పెట్టి, అమ్మానాన్నలతో మద్రాస్ బయల్దేరింది జమున. 'జై వీర భేతాళ'లో మంచి వేషమే. ఈ సినిమాతో కెరీర్ మలుపు తిరుగుతుందనుకున్నారు జమున. కానీ దురదృష్టవశాత్తూ ఆ చిత్రం మధ్యలోనే ఆగిపోయింది. అయితే.. జమున నిరాశ పడలేదు. ఆ విషయం ఆమె ఎక్కడా ప్రస్తావించేవారు కాదు. ఆ వెంటనే ప్రజానాట్యమండలికి చెందిన గరికపాటి రాజారావు నిర్మించిన 'పుట్టిల్లు'లో ఛాన్స్ వచ్చింది. ఈ సినిమా సెట్స్‌పై ఉండగానే 'వద్దంటే డబ్బు' ఆఫర్ వచ్చింది. అయితే ఈ రెండు చిత్రాలూ బాక్సాఫీసు దగ్గర బోల్తా పడ్డాయి. తొలి సినిమా ఆగిపోవడం, రెండు చిత్రాలు ఫ్లాప్ అవ్వడంతో జమున కెరీర్ ఏమవుతుందోనని అనుకున్నారు. కానీ 'మా గోపి' చిత్రం ఆర్థికంగా విజయం సాధించడంతో పాటు జమునకూ మంచిపేరు తెచ్చింది. 'నిరుపేదలు', 'మిస్సమ్మ', 'వదిన గారి గాజులు', 'అంతా మనవాళ్లే' ఇలా వరుస విజయాలతో జమున చిత్రసీమలో ఒక వెలుగు వెలిగారు. ఏ పాత్రకైనా జమున సరితూగుతుందన్న గుర్తింపు తెచ్చుకొన్నారు. 'దొంగరాముడు', 'తెనాలి రామకృష్ణ', 'మూగ నోము', 'రాము', 'బొబ్బిలి యుద్ధం', 'నాదీ ఆడజన్మే', 'పూల రంగడు', 'రాముడు – భీముడు'... ఇలా ఒకటా రెండా, పదుల సంఖ్యలో సినిమాలన్నీ సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. అన్నపూర్ణ, జగపతి, సురేశ్ ప్రొడక్షన్స్ వంటి పెద్ద సంస్థలన్నింటిలోనూ జమున చిత్రాలు చాలానే చేశారు. ఎన్టీఆర్‌తో ఏకంగా 31 చిత్రాల్లో జమున కథానాయికగా నటించారు. దాదాపు అవన్నీ హిట్లే. అన్నింట్లోనూ రకరకాల పాత్రలు చేయడం వైవిధ్యభరితంగా జమున పేరొందారు. అలా జమున కెరీర్ నాన్‌స్టాప్‌గా దూసుకుపోయిందనే చెప్పాలి.

**పదేళ్లగా కథనాయికగా..**

కథానాయికగా పదేళ్లు చిత్రసీమలో ఉండడం ఓ అరుదైన ఘనత. దానికి కారణం.. విభిన్నమైన పాత్రలు, విలక్షణమైన నటన. అల్లరి అమ్మాయిగా, పొగరుబోతు గృహిణిగా, అమాయకపు ఇల్లాలిగా ఇలా అన్ని పార్శ్వాలూ పలికించారు. సత్యభామ పాత్రలకు ఆమెదే పేటెంట్. సత్యభామ పాత్రని ఎలా చేయాలో భావి తరాలకు ఆమె ఓ పాఠం నేర్పించి వెళ్లారు. 'వినాయక చవితి'లో తొలిసారి సత్యభామ అవతారం ఎత్తారు జమున. అందులో ఆ పాత్ర సాత్వికంగానే ఉంటుంది. 'శ్రీకృష్ణ తులాభారం'లో మాత్రం సత్యభామగా జమున విశ్వరూపం చూడొచ్చు. 'సత్యభామ పాత్రని నువ్వు చేయలేవు..' అని హితులు, శ్రేయోభిలాషులు ఆమెను వెనక్కిలాగే ప్రయత్నం చేస్తే ఓ ఛాలెంజ్‌గా స్వీకరించి, ఆ పాత్రని రక్తికట్టించారు. అప్పటి నుంచీ.. సత్యభామ పాత్రంటే జమున గుర్తుకురావడం పరిపాటి. 'పండంటి కాపురం'లో రాణీ మాలినీదేవి.. పాత్ర జమున కెరీర్‌లో మరో కలికితురాయి.

**ట్రెండ్ ఫాలోయర్..**

పెద్దింటి అమ్మాయిగా రాణీమాలినీ దేవిగా ఆమె చూపించిన దర్పం.. ఇంకెవ్వరికీ సాటి రాదు. జమున కట్టు బొట్టు కూడా కొత్తగా కనిపిస్తాయి. ఆమె కళ్లకు పెట్టుకునే కాటుక దగ్గర నుంచి, ఆమె చీర కట్టుకూ అప్పట్లో ఎంతోమంది అభిమానులు. 'జమున చీరలొచ్చారు' అంటూ వస్త్ర దుకాణాల దగ్గర బోర్డులు పెట్టేవారంటే.. ఆ రోజుల్లో జమున క్రేజ్‌ని ఎంతుందో అర్థం చేసుకోవొచ్చు. ఆమె స్టయిల్‌ను హావభావాలతో సహా నాటి మహిళలు ఫాలో అయ్యేవారంటే అతిశయోక్తి కాదు. ఆమె మాట తీరు, ఆ దర్పం అన్నీ ఆమె అభిమానులు చాలామంది



అనుకరించేవారు.

**ఇష్టాయిష్టాలు..**

జమునకు కుక్కలంటే చాలా ఇష్టం. ఆమె ఇంట్లో ఎప్పుడూ ఓ అరడజను బుజ్జి కుక్కలు తిరుగుతూ ఉంటాయి. దాదాపు తన జీవిత కాలంలో దాదాపుగా వంద కుక్కపిల్లల్ని పెంచుకొన్నారావిడ. ఆమెకు వెన్న, మీగడ అంటే ఎంతో ఇష్టం. తన స్నేహితుల దగ్గరికి ఆమె ఎప్పుడు వచ్చినా.. వారు ఆమె దగ్గరికి వచ్చినా వెన్న, మీగడ తీసుకుని వస్తారు. ఆమెకు అవి అంటే అత్యంత ప్రీతిపాత్రం.

**విభేదాలు..సర్దుబాట్లు..**

'భూకైలాస్' చిత్రం షూటింగ్‌లో జరిగిన ఓ సంఘటన కారణంగా ఎన్టీఆర్, ఏయన్నార్ జమునతో కలసి నటించకూడదని నిర్ణయించుకొన్నారు. ఆ తర్వాత మూడేళ్ల పాటు వీరి ముగ్గురి మధ్య మాటలే లేవు. 'గుండమ్మ కథ' చిత్రంతో వీరి మధ్య రాజీ కుదిరింది. ఎన్టీఆర్, ఏయన్నార్, జమున లను ఒకచోట కూర్చో బెట్టి రాజీ కుదిర్చింది చక్రపాణి. అక్కినేని సరసన గుండమ్మ కథ చిత్రంలో నటించిన జమున ఈ ఒప్పందంలో భాగంగా నందమూరితో 'గులేబకావళి కథ' చిత్రంలో నటించారు. అలాగే అక్కాచెల్లెళ్లలా ఉండే సావిత్రితో కూడా ఎవరో గిట్టనివాళ్లు తగాదాపెట్టారని, ఏడాదిపాటు మాట్లాడుకోలేదనీ, ఆ తర్వాత మళ్లీ కలిసిపోయామని జమున ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. అలాగే తమిళ చిత్రసీమలో జయలలితతోనూ రిహార్సల్స్ సందర్భంలో గొడవపడినా, ఆమె నటన చూసి, ఫిదా అయినట్లు జమున ఒక సందర్భంలో చెప్పారు.

**కొత్త హీరోలతోనూ..**

హీరోయిన్‌గా అగ్ర స్థానంలో ఉన్న తరుణంలో కూడా కొత్త హీరోల సరసన నటించడానికి జమున అభ్యంతరం చెప్పేవారు కాదు. కైకాల సత్యనారాయణ తొలి చిత్రం 'సిపాయి కూతురు'లో జమునే హీరోయిన్. అలాగే రమణమూర్తి తొలి చిత్రం 'ఎమ్మెల్యే'లో కూడా జమున కథానాయికగా నటించారు. అలాగే హరినాథ్ తొలిచిత్రం 'మా ఇంటి మహలక్ష్మి'లో జమునే కథానాయిక. వీరి తర్వాత తరంలో కృష్ణంరాజు విలన్ వేషాల నుంచి హీరో పాత్రలు వేయడం మొదలుపెట్టినప్పుడు ఆయన సరసనా జమున నటించారు. సాధారణంగా హీరోయిన్లకు కెరీర్ చాలా తక్కువ. నిత్యం పోటీని ఎదుర్కొంటూ కొంతకాలం తర్వాత తెర మరుగవుతుంటారు. కానీ జమున విషయం అలా కాదు. ఎన్టీఆర్, ఏయన్నార్‌తో ప్రారంభించి, తర్వాతి తరం హీరోలు కృష్ణ, శోభన్‌బాబు, కృష్ణంరాజు, రామకృష్ణతో కూడా ఆమె నటించారు. హాస్య చిత్రాల కథానాయకుడు చలం సరసన 'మట్టిలో మాణిక్యం' సినిమాలో జమున హీరోయిన్‌గా నటించడం ఆ రోజుల్లో సంచలనం. దాదాపు పాతికేళ్లు హీరోయిన్‌గా కొనసాగి, జమున చరిత్ర సృష్టించారు.



**ఆ పాట నాడు గొప్ప క్రేజ్..**

ఎన్టీఆర్, కృష్ణ హీరోలుగా నటించిన 'దేవుడు చేసిన మనుషులు' చిత్రంలో 'తొలిసారి నిన్ను చూశాను నేను' పాటలో జమున ఇచ్చిన అప్పియరెన్స్ అప్పట్లో పెద్ద క్రేజ్. అందులో హీరో అమ్మాయిలతో ఎక్కువగా తిరుగుతుంటాడు. అలాంటి క్యారెక్టర్ పక్కన ఎందుకు చేశావంటూ జమున విమర్శలు సైతం ఎదుర్కొన్నారు. ఆ సమయంలో కృష్ణ, జమున 'మమత' చిత్రంలో కలసి నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కొడైకెనాల్‌లో జరుగుతున్నప్పుడు 'దేవుడు చేసిన మనుషులు' చిత్రం పాటలో నటించమని కృష్ణ అడిగితే జమున కాదనలేకపోయారని ఒక సందర్భంలో ఆమె చెప్పారు.

**బహుభాషా నటి..**

జమున కన్నడ అమ్మాయి అయినా.. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో కూడా నటించారు. ఆ చిత్రాలు కూడా ఘన విజయాలందుకున్నాయి. తమిళ మహానటులు ఎంజీఆర్, శివాజీ గణేశన్, జెమినీ గణేశన్ వంటి వారితో జమున నటించి, ఆకట్టుకున్నారు. 'పణం పడుత్తుం పాడు' (1954), చిత్రంతో కోలీవుడ్‌కు పరిచయమయ్యారు. 'మిస్సియమ్మ(మిస్సమ్మ)', తెనాలి రామన్, తంగమలై రహస్యం, తిరుట్టు రామన్, నాళయతీర్పు వంటి పలు విజయవంతమైన చిత్రాలు జమున నటించినవే. క్యారెక్టర్ నటిగా 'తూంగాదే తంబి తూంగాదే' చిత్రంలో కమల్‌హాసన్‌కు తల్లిగా నటించారు. అప్పట్లో తమిళ పరిశ్రమలో హీరోలకు సమానంగా పారితోషికం పొందిన సావిత్రి తర్వాత ఆ స్థాయిలో అందుకున్న నటి జమునే.

మూడేళ్ల పాటు ఇద్దరు అగ్ర హీరోలు జమునని దూరం పెట్టారు. ఆ సమయంలో జమున బాలీవుడ్‌పై దృష్టి పెట్టారు. అక్కడ 12 చిత్రాల్లో నటించారు. 'మిలన్' చిత్రం ఆమెకు ఎంతో పేరు తీసుకొచ్చింది. ఈ సినిమాకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది. అప్పుడే చాలామంది ముంబైకి మకాం మార్చేయమని జమునకు సలహా ఇచ్చారు. అందుకు ఆమె సమ్మతించలేదు. తెలుగు చిత్రసీమని వదల్లేదు. 'గుండమ్మ కథ'తో జమున హవా మళ్లీ మొదలైంది. కథానాయికగా కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే తిరుపతిలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న రమణారావుని వివాహం చేసుకొన్నారు జమున. పెళ్లి తరవాత కూడా పదేళ్ల పాటు కథానాయికగా అగ్ర స్థానంలోనే ఉన్నారు. అందుకు భర్త సహకారం చాలా ఉందని ఆమె ఒక సందర్భంలో చెప్పారు. ఆ తరవాత కొడుకు వంశీకృష్ణ, కూతురు స్రవంతి పుట్టారు. అటు పిల్లల్ని చూసుకొంటూ, ఇంటి వ్యవహారాలు చక్కబెట్టుకొంటూ, సినిమాల్లోనూ జమున రాణించారు.

**నా కూతుర్ని చూసి గర్వపడుతుంటా!**

స్రవంతి ప్రపంచస్థాయి కళాకారిణిగా రాణిస్తుంది. అమ్మగా ఇంతకంటే సంతోషం ఏం కావాలి? ఐ లవ్ హర్. మనవడూ అమ్మ దారిలోనే గుర్తింపు తెచ్చుకుంటున్నాడు అని ఆమె కూతురు, మనవడు గురించి సగర్వంగా చెబుతారామె.

**కలకాలం కళాకారిణిగా..**



కళాకారుల సమాఖ్య అధ్యక్షురాలిగా ఎనలేని సేవలు చేశారు జమున. రాష్ట్రమంతా తిరిగి పదివేల మంది కళాకారుల వివరాలు సేకరించారు. వాళ్లకు ఇళ్లస్థలాలు మంజూరు చేయడంలో కృషి చేశారు. కొన్ని కాలనీలకు 'జమున' పేరు పెట్టడం ఆమె కృషికి నిదర్శనం.



# హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

## రోడ్లన్నీ జలమయంతో వాహనాదారుల ఇక్కట్లు

## నైతురి ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం

హైదరాబాద

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. జవహర్‌నగర్‌లో రోడ్లపై భారీగా వరద ప్రవహిస్తోంది. శ్రీవేంకటేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో మరోసారి కుండపోతగా వర్షం కురిసింది. జీడిమెట్ల, కొంపల్లి, సుచిత్ర, బాలానగర్, బోయినపల్లి, ఆల్వాల్, మల్కాజ్‌గిరి, మౌలాలి, బేగంపేట్, మలక్‌పేట్, చార్మినార్, ముషీరాబాద్, అబిడ్స్, కోటి, హిమాయత్ నగర్, కాచిగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్, అమీర్ పేట్, అశోక్ నగర్, సికింద్రాబాద్, ఉప్పల్, ముషీరాబాద్, బంజారాహిల్స్, ఓయూ, తార్నాక, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ, కొత్తపేట, హయత్ నగర్, వనస్థలిపురం, ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట, సరూర్‌నగర్, గాజుల రామారం, కుత్బుల్లాపూర్, నిజాంపేట్, మియాపూర్, లింగంపల్లి, బాచుపల్లి, హఫీజ్‌పేట్, ఈసీఐఎల్, కప్రా, నేరేడ్‌మెట్, విద్యానగర్, నల్లకుంట తదితర ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. తీవ్ర వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే -టైమ్ కావడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు-న్నారు. రానున్న రెండు గంటల్లో నగరంలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసే అవకాశముందని ఏఐఈ పేర్కొంది. ప్రజలు ఇళ్ల నుంచి బయటకురాకూడదని.. ముఖ్యంగా వరదనీటితో నిండిన ప్రాంతాల్లో తిరగకూడదని హెచ్చరించింది. వర్షాల కారణంగా ఏమైన సమస్యలు తలెత్తితే వెంటనే 040-29555500, 9000113667 టోల్ ఫ్రీ నెంబర్లు కాల్ చేయాలని సూచించింది.

# భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

## హైదరాబాద్ వాసులకు మంత్రి పొన్నం సూచన

సిద్దిపేట,

హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. జిహెచ్‌ఎంసి విభాగం ప్రత్యేక చర్యలు తీసుకుందని అన్నారు. హైదరాబాద్‌లో వర్షాలపై స్వయంగా ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలలో ఎక్కడైనా ఇబ్బందుల ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇప్పటికే జీహెచ్‌ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్, హైడ్రా కమిషనర్, పోలీస్ కమిషనర్, వాటర్ వర్క్, ఇతర అధికారులను అప్రమత్తం చేసినట్లు- చెప్పారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 25 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జాప్యం లేకుండా త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

# చురుకుగా నైరుతి రుతుపవనాలు


## తెలంగాణలో పలుచోట్ల వర్షాలు

హైదరాబాద్,

నైరుతి రుతు పవనాల ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండ్రోజులు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణకేంద్రం సంచాలకురాలు కె.నాగరత్న తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మరో ఐదురోజులపాటు- మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. ఈ ఐదు రోజులు ఎల్లో అలర్ట్, మూడో రోజు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసినట్లు చెప్పారు. తెలంగాణలోని వికారాబాద్, రంగారెడ్డి, ములుగు, భద్రాద్రి, జయశంకర్, జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు తెలిపారు. ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ ఆశించిన వర్షాలు కురవలేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు వేసి వర్షం కోసం ఎదురుచూశారు. వర్షాలు కురవాలని పూజలు చేశారు. ఎట్టకేలకు వరుణ దేవుడు కరుణించాడు. తెలంగాణలో కుండపోత వానలు కురుస్తున్నాయి. శుక్రవారం అత్యధిక వర్షపాతం నమైదైంది. ఆకాశానికి చిల్లుపడినట్లుగా కుండపోత వానలు కురిశాయి. రోడ్లు కాలువలను తలపించాయి. లోతట్టు- ప్రాంతాలు జలమయమయ్యాయి. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకుంటున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ గుడ్ న్యూస్ అందించింది. తెలంగాణలో ఇక విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపింది. నైరుతి రుతుపవనాలు తిరిగి యాక్టివ్ అయినట్లు- తెలిపింది. మరో రుతుపవన ద్రోణి ఏర్పడే అవకాశం ఉందని.. మరో ద్రోణి ఏర్పడితే భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. రాబోయే నాలుగు రోజుల పాటు- తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురువనున్నట్లు- తెలిపింది. ఈశాన్య బంగాళాఖాతంలో కొనసాగుతున్న రుతుపవన ద్రోణి.. దక్షిణ కోస్తా మీదుగా కొనసాగుతున్న ఉపరితల చక్రవహాక ఆవర్తనం.. నేడు తెలంగాణ తీరానికి దగ్గరగా ద్రోణి.. దక్షిణ తెలంగాణ జిల్లాల్లో నేడు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. భారీ వర్షాలు కురిసే అవకాశం.. ఉండడంతో హైదరాబాదీలు అలెర్ట్ గా ఉండాలని ఐఎండీ సూచన.. జీహెచ్‌ఎంసీ.. డీఆర్‌ఎఫ్ తో పాటు- సంబంధిత అధికారులను అలెర్ట్ చేసింది.



# స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే.. స్వచ్ఛాంధ్రప్రదేశ్ కావాలి





## ఆగస్టు కల్లా సచివాలయంలో ప్లాస్టిక్ నిషేధం

## ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలి

## నేరచరితులను చెత్తలాగా ఊడ్చేయాలి

## గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీతో విద్యుత్ ఉత్పత్తి

## క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా అమరావతి

## తిరుపతి స్వచ్ఛాంద్రప్రదేశ్‌లో సిఎం చంద్రబాబు




తిరుపతి

తిరుపతిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రజా వేదిక కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. తాను తిరుపతిలో చదువుకుంటూనే ఎమ్మెల్యేగా ఎదిగానని, అంచెలంచెలుగా ఎదిగి నాలుగోసారి సీఎం అయ్యానని ఈ సందర్భంగా చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అమరావతిలో క్యాంటమ్ వ్యాలీని నిర్మించి.. ఏఐని అభివృద్ధి చేస్తామని అన్నారు. క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుంది. ప్రఖ్యాత విద్యా సంస్థలు తిరుపతిలో ఏర్పాటు- చేశాం. విద్యుత్ ఉత్పత్తి కోసం గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ తీసుకురాబోతున్నాం. కాలుష్యం లేకుండా గ్రీన్ హైడ్రోజన్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయొచ్చు. వాతావరణ సమాచారం ముందుగా తెలిసేలా యాప్ తీసుకొస్తున్నాం. ఆగస్టు 15 నాటికి వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 700 ప్రభుత్వ సర్వీసులు అందిస్తామని వివరించారు. నేర చరిత్ర కలిగిన నేతలు రాజకీయాల్లోకి వచ్చారు. ఇంట్లో చెత్తను ఊడ్చినట్లు.. నేరచరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలి. గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా



నిరుపయోగంగా ఉన్న వస్తువు నుంచి సంపద సృష్టించవచ్చని తెలిపారు. ప్రగతి పథంలో ముందుకెళ్తున్న మన రాష్ట్రానికి ఇప్పుడు నేర, హత్యా రాజకీయాలు చేసేవాళ్లు అవసరమా? అని సీఎం ప్రశ్నించారు. ఎపీలో పేరుకుపోయిన చెత్తను అక్టోబర్‌లోగా శుభ్రం చేస్తామన్న చంద్రబాబు.. ఏపీ స్వర్ణాంధప్రదేశ్‌గా మారాలంటే స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ బాగుండా లంటే అందరూ స్వచ్ఛత పాటించాలని, ఆగస్టు నెలలోగా సచివాలయంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని చంద్రబాబు తెలిపారు. డిసెంబర్‌లోగా ప్రభుత్వ ఆఫీసుల్లోనూ ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందని చెప్పారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మించి.. ఆఐని అభివృద్ధి చేస్తామని, క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు ఐటీ-కి ప్రాధాన్యం.. ఇప్పుడు క్యాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యం ఉందని చంద్రబాబు అన్నారు. జీవితంలో ఎప్పుడూ హత్యా రాజకీయాలు లేవు. నక్సలిజం, ఫ్యాక్షన్, మతకలహాలపై పోరాడాను. నక్సలైట్లు- నన్ను చంపాలని చూస్తే వేంకటేశ్వరస్వామి కాపాడారు. గత ఐదేళ్లు ప్రజలకు స్వేచ్ఛ లేదు. హత్యా రాజకీయాలు చేయాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టను. నేరస్థుల గుండెల్లో నిద్రపోతా. వైసీపీ నేతలు వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరించారు. నారాసుర రక్తచరిత్ర అని నాపై వివేకా హత్య నింద వేశారు. మామిడి రైతులకు టన్నుకు రూ.12వేలు ఇచ్చి ఆదుకుంటే, రోడ్డుపై మామిడి కాయలు పారబోసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల రాజకీయం చేశారని దుయ్యబట్టారు.

రాష్ట్రాభివృద్ధికి ఒక్కో నెల ఒక్కో కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రం బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని సీఎం పిలుపునిచ్చారు. ఏపీ స్వర్ణాంధప్రదేశ్‌గా మారాలంటే ముందుగా స్వచ్ఛాంధప్రదేశ్‌గా మార్చాలని అన్నారు. జాతీయ స్థాయిలో ఏపీకి 5 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తిరుపతిలో నిర్వహించిన

లెక్కచేయ లేదు. ప్రజల భూములను లాక్కొనేందుకు యత్నించారు. మేం వచ్చాక ఫ్యాక్షనిజం, ముఠా కలహాలు, మతకలహాలు నివారించాం. నేరస్థుల గుండెల్లో నిద్ర పోతాం. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజే నాపై అసత్య ప్రచారం చేశారు. వైకాపా పాలనలో ఎవరికైనా స్వేచ్ఛ ఉండేనా అని చంద్రబాబు ప్రశ్నించారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు- చేసిన స్టాల్స్ పరిశీలించారు. ప్లాస్టిక్ ఎక్కువగా వాడితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరమని చంద్రబాబు చెప్పారు. 120 మైక్రాన్ ఉన్న కవర్లను పూర్తిగా నిలిపేద్దామన్నారు. క్లాత్ బ్యాగ్ వెండింగ్ యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పిన సీఎం.. ప్రపంచంలో ఏ వస్తువు నిరుపయోగం కాదని..



## న్యాయ సమస్యలు

న్యాయం చేయడం ఆలస్యమైతే అన్యాయం చేసినట్టే అనేది పెద్దల మాట. ఓ విచారణ ఖైదీ తన కేసు కోర్టు ముందుకు రావడానికే పదేండ్ల కాలం ఎదురుచూడాలా? ముదివగ్గులు తమ ఆస్తి తగాదాల పరిష్కారానికి 30-40 ఏండ్లు ఓపిక పట్టగలరా? మన దేశంలో న్యాయవ్యవస్థ ఎదుర్కొనే అతిపెద్ద సమస్య పెండింగ్ కేసులు. 'న్యాయవ్యవస్థ స్థితిగతులు' అనే శీర్షికతో సుప్రీంకోర్టు ఆధ్వర్యంలోని పరిశోధన, ప్రణాళిక కేంద్రం ఇటీవల వెలువరించిన ప్రత్యేక నివేదిక దిగ్భ్రాంతికరమైన విషయాలను వెల్లడించింది. పెండింగ్ కేసులు గుట్టలుగా పేరుకుపోవడం వెనుక గల కారణాలను కొంత మేర విశ్లేషించింది.దేశంలోని వివిధ కోర్టుల్లో 2023 అక్టోబర్ నాటికి పెండింగ్ కేసుల సంఖ్య 5 కోట్ల పై చిలుకే. మూడంచెల న్యాయవ్యవస్థలోని సుమారు 20,580 మంది న్యాయమూర్తులు వాటిని పరిష్కరించాల్సి ఉంటుంది. హైకోర్టు జడ్జి స్థానాల్లో 30 శాతం, జిల్లా జడ్జి పోస్టుల్లో 20 శాతం ఖాళీగా ఉన్నాయి. కేసుల సంఖ్యకు, జడ్జిల సంఖ్యకు మధ్యన పొంతన లేకపోగా అందులో భారీస్థాయిలో ఖాళీలున్నాయని దీనిద్వారా స్పష్టమవుతున్నది. జనాభా ప్రాతిపదికన జడ్జిల సంఖ్యను పెంచాలని వచ్చిన ప్రతిపాదనను సుప్రీంకోర్టు 2002లో సమర్థించింది. కేసుల సంఖ్యను బట్టి జడ్జిలను నియమించాలని 2014లో లా కమిషన్ సూచించింది. ఇలా వేర్వేరు కమిటీలు కొత్త కొత్త ప్రతిపాదనలు ముందుకు తెస్తూనే ఉన్నాయి. ఖాళీల భర్తీలో జరిగే జాప్యం మరో సమస్య. దేశంలో కేవలం 9 రాష్ట్రాలు మాత్రమే నిర్దేశిత సమయంలో భర్తీలు పూర్తి చేయగలుగుతున్నాయని సుప్రీంకోర్టు జరిపించిన అధ్యయనంలో వెల్లడైంది.

ప్రపంచదేశాలతో పోలిస్తే భారతదేశంలో జనాభా-జడ్జి నిష్పత్తి అట్టడుగుస్థాయిలో ఉన్నది. అత్యధిక జనాభా కలిగిన చైనాలో 10 లక్షల జనాభాకు 300 మంది జడ్జిల చొప్పున ఉన్నారు. అదే అమెరికాలో 150 మంది ఉన్నారు. మన దేశంలో పది లక్షల జనాభాకు కేవలం 20-21 మంది జడ్జిలున్నారు. మన దేశంలో పెండింగ్ కేసులను బట్టి చూస్తే జడ్జిల సంఖ్య చాలా చాలా పెంచాల్సి ఉందనేది నిర్వివాదాంశం. ఇక న్యాయ నియామకాల విషయంలోనూ ఒక్కో దేశంలో ఒక్కో పద్ధతి ఉంటుంది. మౌలికంగా చూస్తే రాజకీయ, రాజకీయేతర నియామకాలుంటాయని చెప్పాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లయిన బ్రిటన్‌లో న్యాయ నియామకాలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన జ్యుడిషియల్ కమిషన్ అజమాయిషీలో స్వేచ్ఛగా జరుగుతాయి. పార్టీ రాజకీయాలకు ఈ నియామకాల్లో ఏ మాత్రం ప్రమేయం ఉండదు. కాగా అమెరికాలో న్యాయ నియామకాలు ప్రభుత్వాధినేతల కనుసన్నల్లో జరుగుతాయి. మన దేశంలో ఉన్నత న్యాయస్థానాల ఖాళీల భర్తీలు, బదిలీలకు సంబంధించిన కొలీజియం వ్యవస్థపై సర్వోన్నత న్యాయస్థానానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నియామకాలు న్యాయ పర్యవేక్షణలో కాకుండా ప్రభుత్వ అజమాయిషీ కింద జరిగేలా చూసేందుకు కేంద్రం తలపెట్టిన న్యాయ నియామకాల చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. తదనంతర కాలంలో కొలీజియం సిఫారసులపై జాప్యం జరుగుతుండటంతో కొంత అస్థిరత నెలకొంటుండటం చూస్తున్నాం. మన దేశంలో ఒక అంచనా ప్రకారం.. సగటున ఒక కేసు విచారణకు హైకోర్టుల్లో మూడేండ్ల ఒక నెల పడుతుంది. అదే జిల్లా కోర్టుల్లోనైతే ఆరేండ్లు పడుతుంది. అమెరికాతో సహా పలు అభివృద్ధి చెందిన దేశాల్లో 6 నెలల నుంచి సంవత్సరం కాలంలో కేసు పరిష్కారమవుతుంది. మనం ఆ స్థాయిని అందుకోవడం ప్రస్తుతానికైతే దాదాపు అసాధ్యమనే చెప్పాలి.న్యాయ నియామకాల్లో జాప్యంతో పాటుగా పదే పదే దృష్టికి వచ్చే మరో సమస్య సామాజిక సమగ్ర ప్రాతినిధ్యం. విస్తృత సామాజిక, భౌగోళిక, మతపరమైన వైవిధ్యం కలిగిన దేశం మనది. ఆ సమగ్రత న్యాయ నియామకాల్లో ప్రతిఫలిస్తేనే ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం కుదురుతుంది. మహిళా జడ్జిల సంఖ్యతో పాటుగా వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యాన్ని కూడా నివేదిక విశ్లేషించింది. జడ్జిల నియామకాల్లో సామాజిక వర్గాల వారీగా ప్రాతినిధ్యం గురించిన లెక్కలను ఇటీవల కేంద్ర న్యాయశాఖ పార్లమెంటుకు సమర్పించింది. హైకోర్టు జడ్జిల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు 25 శాతం, సుప్రీంకోర్టులో మహిళా న్యాయమూర్తులు కేవలం ముగ్గురు (8.85 శాతం) మాత్రమే ఉండటం ఆలోచించాల్సిన విషయమే. అయితే హైకోర్టుల్లో ఈ సంఖ్య కాస్త మెరుగ్గా 14.1 శాతంగా ఉన్నది. మన ఉన్నత న్యాయస్థానాల్లో సామాజికవర్గాల వారీగా నియామకాలు జరుగవనేది తెలిసిందే. కేసులకు తగ్గట్టుగా న్యాయమూర్తుల పోస్టులను మంజూరు చేసి, భర్తీ చేయడం, మహిళా ప్రాతినిధ్యం, సామాజిక ప్రాతినిధ్యం తగిన స్థాయిలో కల్పించడం జరిగితే, సకాలంలో న్యాయం

# నయా బానిసత్వానికి విముక్తి ఎన్నడు?



శ్రమ దోపిడీ ఓ సామాజిక దురాచారం. సాంకేతిక యుగంలోనూ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శ్రమ దోపిడీకి గురవుతున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు అందక.. ఎక్కువ సమయం పని చేస్తూ యజమానుల చేతుల్లో బానిసలుగా మారుతున్నారు. వారి చేతుల్లో బందీలుగా మారిపోయి వెట్టిచాకిరి బాధితులుగా మిగిలిపోతున్న వారు కోకొల్లలు.ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వలసపోతున్న వారిలో అత్యధికులు వెట్టిచాకిరి బారిన పడుతున్నారు. ఒక నిర్ణీత సమయం అంటూ లేకుండా వారంతా గొడ్డు చాకిరి చేస్తున్నారు. పొద్దు పొడిచిన దగ్గరి నుంచి పొద్దుపోయే వరకు అహర్నిశలు శ్రమించే వారికి సరైన కూలీ కూడా అందకపోవడం విచారకరం. ఇటుక బట్టీల నుంచి పెద్దపెద్ద పరిశ్రమల వరకు మనకు తారసపడిన వారిని ఒకసారి పలకరిస్తే అసలు విషయం తెలుస్తుంది. వారక్కడ ఇష్టంగా పని చేస్తున్నారా? లేదా బలవంతంగా పని చేయాల్సి వస్తున్నదా? అనేది అవగతం అవుతుంది. అప్పులు, ముందస్తు చెల్లింపుల కారణంగా లక్షల మంది ఇప్పటికీ అయిష్టంగానే వెట్టిచాకిరి చేస్తున్నారు. ఒకరి కింద బానిసలగా బతకాలని ఎవరికి మాత్రం ఉంటుంది. కానీ, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మన దేశంలో జనాభాకు తగ్గట్టుగా ఉపాధి కల్పన లేకపోవడం తదితర కారణాల వల్ల లక్షల మంది ఈ సామాజిక దురాచారానికి గురవుతున్నారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం బలవంతంగా పని చేయించడం, మానవ అక్రమ రవాణా నేరం. దాన్ని రూపుమాపడం ప్రభుత్వాల బాధ్యత. వెట్టిచాకిరి బాధితులు ఎక్కడ కనిపించినా వారికి విముక్తి కల్పించి పునరావాసం కల్పించాలి. 1978లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం బాధితుల పునరావాసం కోసం రూ.4,000 ఆర్థిక సాయం చేయాలి. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చట్టంలో పొందుపరిచారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా దీన్ని 2000 సంవత్సరంలో రూ.20 వేలకు, 2022లో రూ.30 వేలకు పెంచారు. ప్రత్యేక పరిస్థితుల్లో పురుషులకు రూ.లక్ష, మహిళలు, బాలలకు రూ. 2 లక్షలు, లైంగిక వేధింపులకు గురైనవారికి రూ.3 లక్షల వరకు పునరావాసం కోసం సాయం చేసేలా జిల్లా కలెక్టర్లకు వెసులుబాటు కల్పించారు. దీంతో పాటు వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందినట్టు ఓ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జారీ చేయాలి. విముక్తి పొందిన వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తున్న ప్రభుత్వాలు.. బాధితులకు పునరావాసం కల్పించడంలో అలసత్వం వహిస్తున్నాయి. ఆర్థిక సాయం చేయాల్సి ఉండటంతో ఈ విషయంలో ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో వారంతా కొంతకాలానికి కొత్త ప్రాంతానికి వెళ్లి అక్కడ తిరిగి వెట్టిచాకిరి బాధితులుగా మారుతున్నారు.వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి, వారికి పునరావాసం కల్పించే విషయంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయనే చెప్పాలి. 1978 నుంచి చూసుకుంటే కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం ఇప్పటివరకు 3,15,302 మంది వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందారు. వారిలో 2,96,305 మందికి ప్రభుత్వం పునరావాసం కల్పించింది.2030 నాటికి 1.8 కోట్ల మందిని వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో సంకల్పించింది. ఆ నాటి నుంచి చూసుకుంటే 32,873 మందికి మాత్రమే విముక్తి కల్పించడం గమనార్హం. అంటే సరాసరి ఏడాదికి సుమారు 4,696 మంది విముక్తి పొందారు. భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న 1.8 కోట్ల లక్ష్యంలో ఇది సుమారు 2 శాతం.ఇప్పటి వరకు విముక్తి పొందిన బాధిత కార్మికులు ఎక్కువగా ఐదు రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. కర్ణాటక (66,281), తమిళనాడు (65,573), ఒడిశా (51,441), ఉత్తరప్రదేశ్ (42,279), ఆంధ్రప్రదేశ్ (38,141) ముందు వరుసలో ఉన్నాయి. ఇది 84 శాతం.నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీలే బాధితులుగా ఉండటం బాధాకరం. 2019లో ఈ చట్టం కింద 1,155 కేసులు నమోదవగా.. వాటిలో 96 శాతం బాధితులు ఎస్సీ, ఎస్టీలే. 2020లో నమోదైన 1,231 కేసుల్లో 94 శాతం, 2021లో నమోదైన 592 కేసుల్లో 96 శాతం వారే బాధితులు. నమోదైన కేసుల సంఖ్యతో సమానంగా విముక్తి కల్పించిన వారి సంఖ్య లేకపోవడం విచారకరం. విముక్తి కల్పిస్తున్నప్పటికీ వారి వివరాలు బయటికి రావడం లేదనేది ఓ వాదన. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, రాజకీయ నేతల హస్తం ఉండటం తదితర కారణాల వల్ల కొన్ని సందర్భాల్లో జిల్లా యంత్రాంగాలు ఈ వివరాలను బయట పెట్టడం లేదని తెలుస్తున్నది.మారుతున్న కాలానికి అనుగుణంగా వెట్టిచాకిరిలోనూ మార్పులు సంభవిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా ఆధునిక బానిసత్వం పుట్టుకొచ్చింది. ఈ బానిసత్వంలో అనేకమంది తమ కుటుంబాల కోసం యాజమాన్యాలను ప్రశ్నించకుండా మిన్నకుంటున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు లేకపోయినా సర్దుకుపోతున్నారు. వారికి కార్మిక చట్టాలు, శ్రమకు తగ్గ వేతనాలు అమలు కావడం లేదు. ఓ సంస్థ అంచనా ప్రకారం మన దేశంలో 1.1 కోట్ల మంది ఆధునిక బానిసత్వంలో మగ్గుతున్నట్టు తేలింది. వారిలో 83 శాతం మంది ఎస్సీ, ఎస్టీలే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో ఇరాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, భారత్‌లో మాత్రమే ఈ ఆధునిక బానిసత్వాన్ని రూపుమాపేందుకు సరైన ప్రణాళికలు లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

# భారతీయ పరిమళం విశ్వవ్యాప్తం

కొవిడ్ మహమ్మారి మానవాళికి ఎన్నో పాఠాలు నేర్పింది. కరోనా నేర్పిన గుణపాఠం ప్రజల్లో చాలా మార్పులు తీసుకువచ్చింది. ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. ప్రజలు సేంద్రియ ఉత్పత్తులను వాడేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. సేంద్రియ విధానంలో సాగైన పూలతో సహజసిద్ధంగా తయారయ్యే సుగంధ పరిమళాలకు కూడా గిరాకీ పెరగడంతో 'ది ఫెర్ఫ్యూమ్ సిటీ ఆఫ్ ఇండియా'గా పేరొందిన కనౌజ్ వెలుగొందుతున్నది.గతంలో కళ తప్పిన మన దేశంలోని అత్తరు పరిశ్రమ ప్రస్తుతం కళకళలాడుతున్నది. కొవిడ్ తర్వాత మారిన ప్రజల అలవాట్ల కారణంగా ఇప్పుడిప్పుడే ఆ పరిశ్రమ పుంజుకుంటున్నది. మహమ్మారి కారణంగా ఉపాధి కోల్పోయిన యువత ఈ పరిశ్రమకు ఊపిరులూదారు. తద్వారా శతాబ్దాల నాటి కళను బతికించడమే కాకుండా అనేకమంది ఉపాధికి మార్గం సుగమం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్టప్‌ల సంస్కృతి అత్తరు పరిశ్రమకు పాకింది. తద్వారా బూండ్ ఫ్రాగ్రెన్సెస్, కస్తూర్, నాసో ప్రొఫ్యూ మి తదితర స్టార్టప్‌లు పురుడుపోసుకున్నాయి. ఈ స్టార్టప్‌లలో అత్యధికం మహిళా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో నడుస్తున్నవే.

మన దేశంలో సుగంధ పరిమళాలు, రుచికి సంబంధించిన పరిశ్రమల ద్వారా ఏటా జరుగుతున్న వ్యాపారం సుమారు రూ.10 వేల కోట్లపైనే. అత్తరు, సువాసనలు, సుగంధ పరిమళాలల్లో వినియోగించే నూనెల వాటా ఇందులో సగంపైనే ఉంటుంది. ఈ రంగంలో ప్రపంచ మార్కెట్‌లో భారత్ వాటా సుమారు 10 శాతం. రానున్న ఐదేండ్లలో అత్తరు పరిశ్రమ మరింత వృద్ధిని సాధిస్తుందని మార్కెట్ రిసెర్చ్ సంస్థ టెక్నావియో అంచనా వేసింది. టెక్నావియో ప్రకారం.. ఏటా 15 శాతం వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నది.ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కనౌజ్ నగరం సహజ సిద్ధమైన సుగంధ పరిమళాల పరిశ్రమకు ప్రసిద్ధి. శతాబ్దాల కిందటే కనౌజ్‌లోని వేల కుటుంబాలు అత్తరు తయారీలో నైపుణ్యం సాధించారు. డెగ్-భక్పా అనే ప్రాచీన పద్ధతిలో తయారుచేసే అత్తరుకు ప్రపంచవ్యాప్తంగా మంచి ఆదరణ ఉన్నది. మొఘలుల కాలంలో అత్తరు తయారీ ప్రారంభమైందని, అప్పటినుంచే కనౌ జ్ అత్తరు పరిశ్రమకు ప్రసిద్ధి గాంచిందని పలువురు నిపుణులు చెప్తుంటారు. అయితే కొంతమంది చరిత్రకారులు ఈ వాదనను ఖండిస్తున్నారు. మొఘలులు మన దేశానికి రాకముందు నుంచే అత్తరు పరిశ్రమ మన దేశంలో ఉన్నదని చరిత్రకారులు అంటున్నారు. సింధూ లోయలో జరిపిన తవ్వకాల్లో సుగంధ పరిమళాలకు సంబంధించిన ఆనవాళ్లు కనిపించడం వారి వాదనకు బలం చేకూరుస్తున్నది.1980ల్లో తీసుకొచ్చిన సంస్కరణల ధాటికి దేశంలోని అత్తరు పరిశ్రమ కుదేలైంది. పశ్చిమ దేశాల నుంచి చౌకైన అత్తరు రాకతో చాలా పరిశ్రమలు మూతపడ్డా యి. 1990ల్లో కనౌజ్ పరిసర ప్రాంతాల్లో సుమారు 700 పరిశ్రమలుండేవి. 2000ల నాటికి ఆ సంఖ్య 150-200కు



పడిపోయింది. చౌకైన సింథటిక్, ఆల్కహాల్ ఆధారిత సుగంధ పరిమళాల కారణంగా అక్కడి పరిశ్రమలు పోటీలో వెనుకబడ్డాయి. అతి ఖరీదైన శాండల్‌వుడ్ (చందనం) నూనెలను వినియోగించడం వల్ల స్వదేశీ అత్తరు ధరలు భారీగా ఉండేవి. అదే సమయం లో పశ్చిమదేశాల సుగంధ పరిమళాలు అతిచౌకగా లభించేవి. పోటీని తట్టుకునేందుకు స్వదేశీ పరిశ్రమలు కూడా ఆల్కహాల్‌ను వాడటం ప్రారంభించడంతో ఈ కళ అంతరించే దశకు చేరుకున్నది.కొవిడ్ కారణంగా కొత్తకొత్త రంగాల్లో అడుగుపెడుతున్న యువత.. దీనిపై కూడా దృష్టిసారించింది. దేశంలోని చేతివృత్తిదారులు, మారుతున్న వినియోగదారుల సంస్కృతికి మధ్య ఉన్న అంతరాన్ని కొత్త తరం పసిగట్టింది. వినియోగదారుల ఆలోచనలకు అనుగుణంగా అంతరించిపోయే దశలో ఉన్న ఆనాటి కళను నేటి యువత తెరపైకి తీసుకొచ్చింది. పలువురు పారిశ్రామికవేత్తలు స్టార్టప్‌ల ద్వారా అత్తరు పరిశ్రమ కు మళ్లీ పురుడుపోశారు. సేంద్రియ పద్ధతుల్లో పం డించిన పూలను వాడుతూ తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. మట్టి, వాన కురిసేటప్పుడు వచ్చే వాసన తదితర ప్రత్యేక వెరైటీలతో విదేశాలకు ఎగుమతులు చేసే స్థాయికి ఎదిగారు. ఐరోపా, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా, మధ్యప్రాచ్య దేశాల్లో వీటికి గిరాకీ ఎక్కువ. ఆల్కహాల్ లేకపోవడంతో అరబ్ దేశా ల్లో వీటిని విరివిగా వినియోగిస్తున్నారు. మరోవైపు చుట్టుపక్కల ప్రాంతాల్లో పూలు సాగు చేసే రైతులు లాభాల బాటపట్టారు. శీతాకాలం, పెండ్లిళ్ల సీజన్, క్రిస్మస్, రంజాన్ తదితర పర్వదినాల సమయంలో వీటికి డిమాండ్ ఉంటున్నది. 6 ఎంఎల్ అత్తరును 20 డాలర్లకు విక్రయిస్తున్నారంటేనే వీటికున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. వేగంగా అభివృద్ధి చెందుతున్న సుగంధ పరిమళాల పరిశ్రమకు కేంద్ర ప్రభు త్వం ప్రోత్సాహం అందించి వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ఉన్నది.

# ఇండ్ల స్థలాలు సాధించేవరకు ఉద్యమం ఆగదు.

## ఉద్యమాన్ని వివిధ రూపాలలో చేసేందుకు కార్యాచరణను ప్రకటించి ముందుకెళ్తాం

## శాంతియుతంగా దీక్షలుచేస్తున్న జర్నలిస్టులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నాం

## దీక్షలకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి చేతులెత్తి నమస్కారం

అక్షరకలం ప్రతినిధి

సీఎం సభ పేరుతో పోలీసులను అడ్డుపెట్టుకొని శాంతియుతంగా ఇండ్లు ఇండ్ల స్థలాల కోసం దీక్షలు చేస్తున్న జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైంది కాదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ అన్నారు. శనివారం రిలే దీక్షలు భగ్నం చేసిన అంశంపై మహబూబ్ ఫంక్షన్ హాల్ లో సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడారుకొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయం ముందు 24 రోజులుగా ఇళ్లస్థలాల కోసం శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తున్న జర్నలిస్టులను ముఖ్యమంత్రి సభ పేరున అరెస్టులు చేసి దీక్షలను భగ్నం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారుప్రభుత్వం పోలీసులు కలిసి దీక్షలను భగ్నం చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదని నియోజకవర్గ జర్నలిస్టులందరికీ ఇండ్లు ఇళ్ల స్థలాలు సాధించేంతవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు . ఉద్యమాన్ని వివిధ రూపాలలో చేసేందుకు కార్యాచరణను ప్రకటించి ముందుకెళ్తామని తెలిపారు. పాలకులకు ప్రభుత్వానికి కొంత సమయాన్ని ఇచ్చి మా డిమాండ్లను నెరవేర్చకపోతే మరో మారు ఉద్యమ కార్యాచరణలు ప్రకటించి పరిష్కారం అయ్యేంతవరకు పోరాడుతామని ఈ సందర్భంగా



తెలియజేశారు కార్యక్రమానికి అధ్యక్షత వహించినజిల్లా అధ్యక్షులు రామచంద్రయ్య మాట్లాడుతూ సీఎం సభ పేరుతో మా దీక్షలను భగ్నం చేసిన మొక్కవోని ధైర్యంతో మునుముందు వివిధ రూపాలలో నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు సమావేశంలో పాల్గొన్న జర్నలిస్టులు అందరూ మాట్లాడుతూ తమకు ఇండ్ల స్థలాలు ఇచ్చేంతవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని పాలకులకు కొంత సమయం ఇచ్చేందుకు ఇలాంటి బెషజాలకు పోకుండా జర్నలిస్టులందరికీ న్యాయం జరిగితే అంతే చాలు అన్నారు నిన్న జరిగిన అరెస్టులు తీవ్రంగా ఖండిస్తూ ఇలాంటి పర్వం ఎక్కడ లేదని కేవలం కొల్లాపూర్ కి పరిమితమైనందుకు చింతిస్తున్నామని ఇకనైనా పాలకులు జర్నలిస్టులను చులకన భావంతో చూడకుండా వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు దీక్షలకు మద్దతు ప్రకటించి మాకు వెన్నంటి ఉండి నడిపించిన బిఆర్ఎస్ బిజెపి సిపిఎం సిపిఐ టిడిపి బీఎస్పీ ఎమ్మార్పీఎస్ విద్యార్థి సంఘాలకు ఆర్యవైశ్య సంఘం బేడ బుడగ జంగాల సంఘం వడ్డెర సంఘం ముదిరాజ్ సంఘం శ్రీశైలం 98 జీవో నాయకులు మాల మహానాడు నాయకులు స్వచ్ఛంద సంస్థ నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం డాక్టర్లు న్యాయవాదులు కార్మికులు మహిళా సంఘాలు బీసీ సంఘాలు తదితర నాయకులు మీ అండదండలు ఎల్లప్పుడూ మీ అండదండలు కొనసాగాలని కోరుతూటీ డబ్ల్యూ జె ఎఫ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ సాగర్, జలకం మద్దిలేటి,బచ్చల కూర కురుమయ్య, సిపి నాయుడు,భాను ప్రకాష్, కారంగి గోవిందు ,రమణ స్వాములు, సురేందర్ ,మల్లేష్ శివ ,తరుణ్

# కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుంది

## అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు

## రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ

## స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు అండగా ఉండాలి

## రేషన్ కార్డుల పంపిణీలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్










అక్షరకలం ప్రతినిధి

నల్లగొండ రేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని శాసనమండలి సభ్యులు, డిసిసి అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ అన్నారు శనివారం ఆయన నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో నల్గొండ నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు మంజూరు చేయలేదని, అలాంటిది తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన రేషన్ కార్డులను ఇస్తున్నదని తెలిపారు. తమ ప్రభుత్వం పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రేషన్ కార్డులు రానివారు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని చెప్పారు.జిల్లా సర్వతో ముఖ వృద్ధి కోసం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎంతో కృషి చేస్తున్నాడని అన్నారు. అభివృద్ధిలో నల్గొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళుతున్నాడని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలంతా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉండి గెలిపించాలని కోరారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిసారిగా సన్నబియ్యాన్ని పంపిణీ చేసిన రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.సన్న బియ్యం దుర్వినియోగం కాకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రేషన్ కార్డులు రాని వారందరూ రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఇది నిరంతరం కొనసాగుతుందని, ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని తెలిపారు. అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కాగా నల్గొండ నియోజకవర్గంలో శనివారం వరకు 10,001 కొత్త రేషన్ కార్డులను ఇవ్వడం జరిగింది. అంతేకాక 12,733 మందిని రేషన్ కార్డులలో నమోదు చేయడం జరిగింది. కల్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ పథకం కింద 204 మందికి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనమహోత్సవం కింద ఎమ్మెల్సీ, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఆర్డీవో, సిబ్బందితో సహా ఆర్ డి ఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, తహసిల్దార్ పరుశురాం, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, డిసిసి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మీ శ్రీనివాస్, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, నల్గొండ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి,ఇతర ప్రజా ప్రతినిధులు ,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ వెల్లెంల రిజర్వాయర్ ఆకస్మిక తనిఖీ చేసిన రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

అక్షరకలం ప్రతినిధి

ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఆదేశాలు ఇచ్చిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్



రెడ్డి గారు రిజర్వాయర్ ఫుల్ లెవల్‌కు నీటిని నింపేందుకు అధికారులకు స్పష్టమైన సూచనలులెఫ్ట్, రైట్ మెయిన్ కెనాల్స్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్న ఆదేశందోమలపల్లి చెరువును 10 రోజుల్లో నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశం ఫీడర్ చానల్ తవ్వకాలకు తక్షణమే ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని సూచనభూసేకరణ పరిహారం రైతుల ఖాతాల్లో వెంటనే జమ చేయాలని ఆర్డీవో, అడిషనల్ కలెక్టర్ కు ఫోన్‌లో ఆదేశం ఇప్పటివరకు 15,000 ఎకరాలకు సాగునీరు %-% లక్ష ఎకరాల లక్ష్యం సాధించడమే ధృఢ సంకల్పంఈ తనిఖీ సందర్భంగా ఇరిగేషన్ అధికారులను అభినందించిన మంత్రి గారు, ప్రతి ఒక్కరూ రైతుల పట్ల కమిట్మెంట్ తో పనిచేయాలన్నారు.



# రెజ్లింగ్‌లో భారత్‌కు స్వర్ణం!

పోలీయాక్ ఇమ్రే-వర్గా జానోస్ మెమో[illegible] 2025 రెజ్లింగ్ టోర్నీలో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ స్వర్ణ పతకం సాధించాడు. హంగేరీలోని బుడాపెస్ట్ వేదికగా గురువారం జరిగిన 65



కేజీల పురుషుల ఫ్రీస్టైల్ ఫైనల్లో సుజీత్ కల్కల్ 5-1 తేడాతో రహీమ్‌జాదేను ఓడించాడు. ఈ ఏడాది జరిగిన రెజ్లింగ్ ర్యాకింగ్ సిరీస్‌ల్లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. అమ్మాన్, మంగోలియా వేదికగా జరిగిన రెజ్లింగ్ టోర్నీల్లో భారత రెజ్లర్లు పతకాలు సాధించకుండానే వెనుదిరిగారు. ఫైనల్లో సుజీత్ ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించాడు. తొలి పిరియడ్‌లోనే ఒక యాక్టివిటీ పాయింట్ సాధించిన సుజీత్.. రెండో పిరియడ్ పూర్తయ్యేసరికి రెండు యాక్టీవిటీ పాయింట్స్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆఖరి వరకు ఇదే జోరును కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో సుజీత్ తొలి రౌండ్‌లో 11-0 తేడాతో పారిస్ 2024 ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ అల్బేనియా రెజ్లర్ ఇస్లాం దుడాయేవ్‌ను ఓడించాడు. క్వార్టర్ ఫైనల్లో యూరోపియన్ రెజ్లర్, సిల్వర్ మెడలిస్ట్ ఖమ్జాత్ అర్సామెర్జూయెవ్‌ను చిత్తు చేశాడు. సెమీఫైనల్లో ఆర్మేనియాకు చెందిన వాజ్‌జెన్‌ను 6-1 తేడాతో ఓడించాడు.ఇదే టోర్నీలో పురుషుల 57 కిలోల విభాగంలో భారత్‌కు మరో పతకం దక్కింది. కాంస్య పోరులో భారత రెజ్లర్ రాహుల్ 4-0తో జర్మనీకి చెందిన నిక్లాస్ స్టెచెలేపై విజయం సాధించి బ్రాంజ్ దక్కించుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్-ఫైనల్లోరాహుల్ 5-3 తేడాతో కొరియాకు చెందిన కిమ్ సంగ్‌ను ఓడించాడు. కానీ సెమీఫైనల్లోరాహుల్ 6-7 తేడాతో అమెరికా రెజ్లర్ ల్యూక్ జోసెఫ్ చేతిలో ఓటమిపాలయ్యాడు.ఇతర పోటీల్లో భారత్‌కు చెందిన ఉదిత్(61 కిలోల విభాగం), విక్కీ(97 కిలోల విభాగం) ఓటమిపాలయ్యారు. ఈ టోర్నీలో పొందే ర్యాకింగ్ పాయింట్స్.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో క్రొయేషియాలోని జాగ్రెబ్ వేదికగా జరిగే వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీడింగ్ పొందేందుకు ఉపయోగపడుతాయి.

# సంపదను సృష్టించడంలో రారాజు బీసీసీఐ

క్రికెట్ రిచెస్ట్ క్రికెట్ బోర్డు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) చరిత్ర సృష్టించింది. సంపదను సృష్టించడంలో మరోసారి రారాజుగా నిలిచింది. క్రికెట్ పెద్దన్నగా ప్రపంచాన్ని శాసిస్తున్న బీసీసీఐ.. 2023- 24 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ. 9,741.7 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇందులో సగం కంటే ఎక్కువ ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్) ద్వారానే రావడం గమనార్హం. ప్రస్తుతం బీసీసీఐ వద్ద సుమారు రూ. 30 వేల కోట్లు సేవింగ్స్‌గా ఉండగా.. వీటి మిత్తి(వడ్డీ) ద్వారానే ఏడాదికి బోర్డు ఖాతాలో రూ. 1000 కోట్లు జమవుతున్నాయి. ప్రస్తుతం ఈ లెక్కలు క్రికెట్ అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నాయి. బీసీసీఐకి ఐపీఎల్ బంగారు బాతుగా మారింది. బోర్డు ఆర్జించిన వార్షిక ఆదాయంలో ఐపీఎల్ వాటా 59 శాతంగా ఉంది. ఈ క్యాష్ రిచ్ లీగ్ ద్వారానే రూ. 5,761 కోట్లు బోర్డు ఖాతాలో చేరాయి. 2007లో ప్రారంభమైన ఐపీఎల్..బీసీసీఐ తలరాతను పూర్తిగా మార్చేసింది. కేవలం ప్యాయర్ షిప్, ప్రతిభ కలిగిన ఆటగాళ్లను వెలికి తీయడమే కాకుండా ఆర్థికంగా బోర్డుకు కీలకంగా మారింది. ఈ టోర్నీ మీడియా హక్కుల ద్వారానే బీసీసీఐ కోట్ల రూపాయాలను ఆర్జిస్తోంది. ప్రతిభ కలిగిన దేశవాళీ ఆటగాళ్లకు కూడా ఐపీఎల్ ఓ వేదికగా మారింది. సీజన్ సీజన్‌కు మరింత అభివృద్ధి చెందుతూ బ్రాడ్‌కాస్టర్స్, స్పాన్సర్స్ నుంచి డిమాండ్‌ను సొంతం చేసుకుంటుంది. పీఎల్ కానీ మీడియా హక్కుల ద్వారా బోర్డు అదనంగా రూ. 361 కోట్లను ఆర్జించింది. వుమెన్స్ ప్రీమియర్ లీగ్ ద్వారా బోర్డుకు రూ. 378 కోట్లు వచ్చాయి. రూ. 30వేల కోట్ల సేవింగ్స్ నుంచి దాదాపు రూ. 1000 కోట్ల వడ్డీ వచ్చింది. ఏడాది ఏడాదికి బీసీసీఐ ఆదాయం పెరుగుతుందే తప్పా తగ్గడం లేదు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ. 4,360 కోట్లు ఆర్జించిన బీసీసీఐ.. 2022-23లో రూ. 6820 కోట్లను రాబట్టింది. ఇప్పుడు ఏకంగా రూ.9,741.7 కోట్లను ఆర్జించింది. గత రెండేళ్లలో బీసీసీఐ ఆదాయం రూ.5 వేల కోట్లు పెరిగింది. ఐపీఎల్ మీడియా రైట్స్, కమర్షియల్ ఒప్పందాలతోనే ఈ పురోగతి సాధ్యమైంది.

................

# హరితహారం కార్యక్రమంలో భాగంగా నల్గొండ ఆర్డీవో



**అక్షరకలం ప్రతినిధి**

హరితహారం కార్యక్రమంలో భాగంగా నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో మొక్కలు నాటిన ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గారు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ గారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అశోక్ రెడ్డి గారు, మాజీ మున్సిపల్ చైర్మన్లు బురి శ్రీనివాస్ రెడ్డి గారు, బొడ్డుపల్లి లక్ష్మి గారు, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ గారు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి గారు, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ గారు, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య గారు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి గారు, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరకలం ప్రతినిధి నల్గొండ**

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా నల్గొండ ఆర్డీవో కార్యాలయంలో జరిగిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ గారు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ గారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ వై.అశోక్ రెడ్డి, తాసిల్దార్ పరశురాం,నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ లు బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డుపల్లి లక్ష్మి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, నల్గొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జూలకంటి వెంకట్ రెడ్డి,పలువురు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# మద్యం కేసులో సిట్ విచారణకు మిథున్ రెడ్డి

### తనను అరెస్ట్ చేసి ఆనదించాలన్నదే వారి అభిమతం

### ఈ కేసుల న్యాయస్థానంలో నిలువదని వ్యాఖ్య

**విజయవాడ,**

ఏపీ మద్యం కుంభకోణం కేసులో భాగంగా వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి విజయవాడలో సిట్ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఢిల్లీ నుంచి విజయవాడ చేరుకున్న ఆయన శనివారం నేరుగా సిట్ కార్యాలయానికి చేరుకున్నారు. ఆయన ఈ కేసులో ఏ4గా ఉన్నారు. ఇప్పటికే మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. శుక్రవారం సుప్రీంకోర్టు కూడా ఆయన పిటిషన్‌ను తోసిపుచ్చింది. మిథున్‌రెడ్డి రాక నేపథ్యంలో సిట్ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు- చేశారు. వాహనాల రాకపోకలను పోలీసులు నియంత్రించారు. మిథున్‌రెడ్డి ఏ క్షణమైనా అరెస్టయ్యే అవకాశం కనిపిస్తోంది. హైకోర్టు, సుప్రీంకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేయడంతో ఆయనపై అరెస్టు వారంట్ జారీ కోసం సిట్ అధికారులు శుక్రవారం విజయవాడ ఏసీబీ కోర్టులో మెమో వేశారు. అయితే హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలకు సంబంధించి పూర్తి వివరాల్ని దానికి అనుబంధంగా సమర్పించాలని ఆదేశిస్తూ న్యాయాధికారి ఆ మెమో రిటర్న్ చేయటంతో.. వాటిని ఆగమేఘాలపై సమర్పించారు. ఇదిలావుంటే లిక్కర్ కేసులో తనను అనవసరంగా ఇరికించారని, ఇది చెల్లదని మిథున్ రెడ్డి అన్నారు. కావాలనే వారు తనను అప్రతిష్ట చేయాలని చూస్తున్నారని అన్నారు. ఈ కేసులో న్యాయపరంగా పోరాడుతానని అన్నారు. తనను అరెస్ట్ చేసి ఆనందం పొందాలని చూస్తున్నారని కూడా వ్యాఖ్యానించారు.

# టిటిడిలో అన్యమతస్థుల తొలగింపు

**నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసిన టిటిడి**

**తిరుపతి,**

నలుగురు అన్యమత ఉద్యోగులని తిరుమల తిరుపతి దేవస్థానం సస్పెండ్ చేసింది. ఈ మేరకు శనివారం టీటీడీ ప్రకటన విడుదల చేసింది. టీటీడీలో పనిచేస్తున్న బి.ఎలిజర్, డిప్యూటీ- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (క్వాలిటీ- కంట్రోల్), ఎస్. రోసి, స్టాఫ్‌నర్స్(బర్డ్ ఆస్పత్రి), ఎం.ప్రేమావతి, గ్రేడ్ -1 ఫార్మసిస్ట్ (బర్డ్ ఆస్పత్రి), అదేవిధంగా డా.జి.అసుంత. ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీల్లో విధులు నిర్వహిస్తున్న ఈ నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు టీటీడీ అధికారులు తెలిపారు. సదరు నలుగురు ఉద్యోగులు క్రిస్టియన్ మతాన్ని అనుసరిస్తున్నారని.. అందుకు సంబంధించిన ఆధారాలు, వీరిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేశామని అధికారులు తెలిపారు.

# ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలి

### – జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐ.పి.యస్

### ఈ సంవత్సరం కాలంలో ఒకరికి ఉరి శిక్ష,10 మందికి జీవిత ఖైదుతో పాటు వివిద కేసుల్లో మొత్తం 75 మందికి శిక్షలు విధింపు

### నిందితులకు శిక్ష పదేవిధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు, సి.డి.ఓలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేత






**అక్షరకలం ప్రతినిధి నల్గొండ**

కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడే విధంగా చేసినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయనీ ఇందుకు గాను ప్రతి కేసులో



నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని జిల్లా యస్.పి గారు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ లకు, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్ లకి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి కేసుల్లో నిందితులకు దోషులుగా నిరూపించి శిక్షలు పడేలా పని చేయాలని అన్నారు. కోర్టు అధికారులు, ప్రాసిక్యూటర్ల సమన్వయంతో న్యాయ సలహాలు ఆడిగి పని చేయలని అన్నారు. కేసు తుది దశలో సాక్షులను, నిందితులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని చూచించారు.

నేరస్తులకు శిక్షలు పడేలా పని చేయడంలో సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారితో పాటు కోర్టు డ్యూటీ సిబ్బందికి చాలా బాధ్యత ఉంటుందని చెప్పారు. కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, తద్వారా ప్రజలకు పోలీస్ శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఈ సంవత్సర కాలంలో జిల్లా వ్యాప్తంగా ఒక్కరికీ ఉరిశిక్ష పడగా 10 మందికి జీవిత ఖైదు వివిధ కేసులలో మొత్తం 75 మందికి శిక్షలు విధించడం అభినందనీయం అని అన్నారు.ఈ సందర్భంగా నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన ప్రాసిక్యూటర్ లకు మరియు కోర్టు డ్యూటీ అధికారులకు జిల్లా యస్.పి గారు అభిందినందించి ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్,డి.సి.ఆర్బి డీఎస్పీ రవి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ లు శ్రీవాణి, అఖిల, జవహర్ లాల్, రంజిత్ కుమార్,డిసిఆర్బి సిఐ శ్రీను నాయక్, యస్.ఐ వెంకట్ రెడ్డి,కోర్టు డ్యూటీ లైజెనింగ్ ఆఫీసర్ నరేందర్,కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో గోరింటాకు మహోత్సవం.

## బహుమతుల పంపిణీ

**నల్లగొండ ,జూలై 19**

ఆర్యవైశ్య సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు నాంపల్లి భాగ్యఆధ్వర్యంలో గోరింటాకు మహోత్సవాన్ని శనివారం స్థానిక ఆర్యవైశ్య జిల్లా సంఘం భవనంలో మహిళలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వాసవి మాత అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం హాజరైన వందలాదిమంది మహిళలలకు తంబోలా గేమ్స్ నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరము.సామూహికంగా చెట్ల నుండి గోరింటాకును తీసుకువచ్చి, గౌరీ దేవి ముందు ఉంచి శాస్త్రక్తంగాప్రత్యేక పూజలు నిర్వహించారు.గౌరీ పూజ అనంతరం సంప్రదాయబద్ధంగా గోరింటాకు నూరి, చేతులపై రకరకాల డిజైన్లలో పెట్టు కున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూఏ శుభకార్యం జరిగినా గోరింటాకు ను పెట్టుకోకుండా మహిళలు శుభకార్యాలు మొదలు పెట్టరని అన్నారు.గోరింటాకు వల్ల ఎన్నో ఆరోగ్యపరమైన ప్రయోజనాలు కూడా ఉన్నాయని, గోరింటాకు చేతులకు పెట్టుకోవడం వల్ల శరీరంలో వేడి తగ్గుతుందని చెప్పారు. అందరం కలిసికట్టుగా ఉండి గోరింటాకు పండుగను జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఉల్లాసంగా ఉత్సాహంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే మహిళలకు మానసికంగా ఎంతో ఊరట కలుగుతుందని చెప్పారు. ఆషాడ మాసంలో మహిళలందరూ గోరింటాకు పెట్టుకోవడం తరతరాలుగా ఆనవాయితీగా వస్తుందని, అదే ఆనవాయితీ ఇప్పటికీ కొనసాగడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పట్టణ జిల్లా ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్ ,వనితా క్లబ్ , మహిళలు కాసం శోభారాణి, బండారు జ్యోతి, వనమా పద్మ, కొమిరిశెట్టి రమాదేవి ,గుబ్బ లీలారని, పెట్నకోట హరిత ,వనమా శోభారాణి ,లక్ష్మి శెట్టి పారిజాత, లకుమారపు సునీత ,సోమ హైమావతి, మురారి శెట్టి నందిని ,సోమా దీప్తి ,మిట్టపల్లి కలమ్మ, మురారి శెట్టి రత్నమాల, తల్లం కల్పన, మిర్యాల సౌభాగ్య, మురారి శెట్టి సునీత, తుంకునూరి సునీత, బండారు వాణి పాలారపు హేమలత, మిట్టపల్లి పవన్ ,వేలుపెల్లి పద్మ ,తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955